మహారాష్ట్రలో బైక్‌ను తప్పించబోయి బస్సు బోల్తా... 9 మంది మృతి




# పల్లె వెలుగు

తెలుగు దిన పత్రిక
అవినీతిపై నిఘా
RNI-APTEL/2012/46499

సబ్ డిటర్ : మహేష్ యాదవ్: వెల - 6 సంపుటి : 13 - సంచిక 195 ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ ఆదివారం 01- 12 - 2024 పేజీలు : 8



## ఇదేంటి పవన్ కల్యాణ్... మీకు అధికారులు సహకరించకపోవడం ఏంటి?



నిన్న కాకినాడ పోర్టు తనిఖీ చేసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అధికారులు సహకరించలేదని తీవ్ర అసంతృప్తి

పవన్ కల్యాణ్ పరిస్థితి విచిత్రంగా ఉందన్న అంబటి రాంబాబు

అధికారంలో ఉన్నది మీరే కదా అంటూ వ్యాఖ్యలు

అధికారులు సహకరించవద్దని చంద్రబాబు, లోకేశ్ ఏమైనా చెప్పారా అంటూ ప్రశ్న

వివరాలు 2లో

## ఇలాంటి కేసులు ఎన్నో చూశాం: గౌతమ్ అదానీ




అమెరికాలో అదానీ గ్రూప్ సంస్థలపై కేసులు నమోదు

ఇటువంటి కేసులు ఎదుర్కోవడం కొత్త కాదన్న గౌతమ్ అదానీ

సమస్యలు, దాడులు తమను మరింత దృఢంగా మార్చుతాయని వెల్లడి 2లో

### డిసెంబర్ 5న మహారాష్ట్ర సీఎం ప్రమాణ స్వీకారం!

బీజేపీ సీనియర్ నేత వెల్లడించినట్లుగా ఇంగ్లీష్ మీడియాలో వార్తలు

సీఎం రేసులో ఫడ్నవీస్ ముందున్నారన్న బీజేపీ సీనియర్ నేత

డిసెంబర్ 5న ఆజాద్ మైదానంలో సీఎం ప్రమాణ స్వీకారం ఉంటుందన్న నేతల




మహారాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 5న కొలువుదీరే అవకాశముందని బీజేపీకి చెందిన సీనియర్ నేత ఒకరు చెప్పారు. ఈ మేరకు ఇంగ్లీష్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి రేసులో దేవేంద్ర ఫడ్నవీస్ ముందున్నట్లు అతను చెప్పినట్లుగా ఇంగ్లీష్ మీడియా వెల్లడించింది.కొన్ని రోజుల కిందట కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో మహాయుతి నేతలు భేటీ అయ్యారు. మరుసటి రోజు సీఎం అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకోవడానికి

### నేడు ఏపీలో పెన్షన్ల పంపిణీ

రేపు ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పంపిణీ

అనంతపురం జిల్లా నేమకల్లు గ్రామంలో చంద్రబాబు పర్యటన




-మిగతా2లో

ఏపీలో ఒక రోజు ముందుగానే సామాజిక పెన్షన్లు అందజేశారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో, నేడు నవంబరు 30వ తేదీనే ఇంటింటికీ తిరిగి పెన్షన్లు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లా నేమకల్లులో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందించారు

## కేడీసీసీ బ్యాంకు కుంభకోణంలో మరో బ్యాంకు ఉద్యోగిపై వేటు..







రాత్రి 9గంటలు కావస్తున్నా బ్యాంకు లో గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతున్న విచారణ

బ్యాంకు కుంభకోణంలో మరి కొంత మంది ఉద్యోగులపై వేటుపడే అవకాశం.?.,

గతంలో 80 లక్షల బ్యాంకు కుంభకోణం లో ముగ్గురిపై వేటు



ఆత్మకూరు నవంబర్ 30 పల్లె వెలుగు

### రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ తత్వం బోధపడినట్లుగా ఉంది: హరీశ్ రావు

కాంగ్రెస్ ఏడాది పాలనలో అన్ని వర్గాలను ఏడిపించారని విమర్శ

కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫాం హౌస్ ఉందని నిరూపించగలవా? అని నిలదీత

అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా సమయం కేటాయించే దమ్ముందా? అని ప్రశ్న 2లో




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ తత్వం బోధపడినట్లుగా ఉందని, అందుకే మళ్లీ తనకు అవకాశం వస్తుందా? అనే ఆందోళన ఆయనలో కనిపిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో అన్ని వర్గాలను ఏడిపించడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. మహబూబ్ నగర్ జిల్లాలో బహిరంగ సభలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు.ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫాం హౌస్ ఉన్నట్లు నిరూపించగలవా?

నిలిచిన 'నామమాత్రం' చెల్లింపులు

విద్యార్థులపై యాజమాన్యాల ఒత్తిళ్లు

విద్యా హక్కు చట్టానికి తూట్లు

బడుగులకు భారంగా కార్పొరేట్ విద్య

పేద విద్యార్థులపై ఫీజుల పిడుగు పడింది. విద్యా హక్కు చట్టం ప్రకారం (ఆర్‌టీఈ) ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన వారికి గత ప్రభుత్వం నామమాత్రపు ఫీజు కూడా చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ అంశంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. దీంతో ఫీజు చెల్లించలేక విద్యార్థులు బయటికి వచ్చే దుస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్ విద్య అందని ద్రాక్షగా మారనుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కర్నూలు నవంబర్ 30 పల్లె వెలుగు

2లో



## పేదలపై ఫీజుల పిడుగు

### ఫెంగల్ తుపాను ఎఫెక్ట్... తెలుగు రాష్ట్రాల నుంచి పలు విమాన సర్వీసులు రద్దు

బంగాళాఖాతంలో ఫెంగల్ తుపాను


చెన్నైలో వరదలు...

విమానాశ్రయం మూసివేత


విమానాల రాకపోకలకు ప్రతికూల వాతావరణం

ఏపీ, తెలంగాణ నుంచి పలు విమాన సర్వీసుల నిలిపివేత

2లో




### నటి జెత్వానీ కేసు: ఐపీఎస్ లకు బెయిల్ ఇవ్వొద్దంటూ సీఐడీ అఫిడవిట్




సంచలనం సృష్టించిన కాదంబరి జెత్వానీ వ్యవహారం

ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసిన ఐపీఎస్ అధికారులు

ఏపీ హైకోర్టులో అఫిడవిట్ సమర్పించిన సీఐడీ

### బంగ్లాదేశ్ రోగులకు చికిత్స చేయం

: కోల్‌కతాలోని ఆసుపత్రి ప్రకటన

బంగ్లాలో హిందువులపై దాడులు, భారతీయ జెండాకు అవమానం

అందుకే బంగ్లా రోగులకు చికిత్స చేయమన్న జేఎన్ రే ఆసుపత్రి

నిరవధికంగా... చికిత్స చేయబోమని నోటిఫికేషన్



# పెన్షన్ల పంపిణీలో పైసా అవినీతి ఉన్నా ఒప్పుకోను

చంద్రబాబు నేమకల్లులో దివ్యాంగురాలు భాగ్యమ్మ ఇంటికి వెళ్లారు. ఆమె కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆమెకు దివ్యాంగ పింఛను రూ.15 వేలు అందజేశారు. అదే గ్రామంలో రుద్రమ్మ అనే వితంతు మహిళ ఇంటికి కూడా వెళ్లి పెన్షన్ అందజేశారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... ఇద్దరు మహిళల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్లు అందించానని వెల్లడించారు. ప్రజల్లోని ఆనందం శాశ్వతంగా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. మెరుగైన పెన్షన్ల ద్వారా వితంతువులు, దివ్యాంగులకు అండగా ఉన్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. "అణగారిన వర్గాలకు అండగా ఉండడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల హామీ మేరకు పెంచిన పెన్షన్లను ఏప్రిల్ నుంచి లెక్కగట్టి ఇచ్చాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెన్షన్లను ప్రవేశపెట్టింది ఎన్టీఆర్. ఇప్పుడు రాష్ట్రంలో 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం. పెన్షన్ల రూపంలో ఈ ఐదు నెలల్లో రూ.18 వేల కోట్లు పంపిణీ చేశాం. పెన్షన్ మూడు నెలలకు ఒకసారి కూడా తీసుకునే వెసులుబాటు కల్పించాం. పెన్షను లబ్ధిదారుల్లో కూలీలు, కార్మికులు ఉన్నారనే ఈ సౌకర్యం తీసుకువచ్చాం. దేశంలోనే ఎక్కువ పెన్షన్ ఇచ్చే రాష్ట్రం మనదే. పెన్షన్ల పంపిణీలో పైసా అవినీతి ఉండకూడదని స్పష్టం చేశాను.

పేదలకు అనేక రకాలుగా మేలు చేయాలని ఉంది... కానీ సమస్యలు చాలా ఉన్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనతో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయి. ముందు వాటిని బాగు చేయాల్సి ఉంది" అని సీఎం చంద్రబాబు వివరించారు.

అనంతపురం జిల్లా అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం: చంద్రబాబు మీ పంటలకు నీళ్లు ఇస్తానని గతంలో ఇక్కడి రైతులకు హామీ ఇచ్చాను. రాయలసీమను రతనాల సీమగా మార్చుతానని చెప్పాను. మొన్నటి ఎన్నికల్లో ప్రజలంతా ఆలోచించి ఓటేశారు. అనంతపురం జిల్లా అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం ఉంది. రాయదుర్గం అంటే చాలా వెనుకబడిన ప్రాంతం. రాయదుర్గం ప్రాంతం ఎడారిగా మారకుండా చర్యలు చేపట్టాం. రాయదుర్గం ప్రజల్లో వెలుగులు నింపే బాధ్యత తీసుకుంటాం.

హంద్రీ నీవాపై రూ.4,500 కోట్లు ఖర్చు చేశాం. రాయలసీమలోని ప్రాజెక్టులకు రూ.12,500 కోట్లు ఖర్చు చేశాం. ఇక్కడున్న నేమకల్లు ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం.

# ఇదేంటి పవన్ కల్యాణ్... మీకు అధికారులు సహకరించకపోవడం ఏంటి?

ఇటీవల కాలంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తరచుగా పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిన్న కాకినాడ పోర్టు తనిఖీ సందర్భంగా అధికారుల తీరుపైనా ఆగ్రహం వెలిబుచ్చారు. తాను కాకినాడ పోర్టుకు తనిఖీకి వస్తుంటే, మీరు రావొద్దంటూ కొందరు రాత్రివేళ ఫోన్లు చేశారని పవన్ వెల్లడించారు. మీరు వస్తే 10 వేల మంది జీవితాలు అతలాకుతలం అవుతాయని చెప్పారని వివరించారు.

ఇక అక్రమ బియ్యంతో పట్టుబడిన నౌకను పరిశీలిద్దామనుకుంటే, ఆ నౌకలో మీరు పరిశీలించేందుకు, షిప్ లో పైకి ఎక్కేందుకు అనువైన పరిస్థితులు లేవని అధికారులు చెప్పారని... తనను నౌకలోకి తీసుకెళ్లకుండా అక్కడక్కడే తిప్పారని పవన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాను తనిఖీలకు వస్తుంటే జిల్లా ఎస్పీ సెలవుపై వెళ్లిపోవడం అనుమానం కలిగిస్తోందిన అన్నారు.

ఈ నేపథ్యంలో... పవన్ వ్యాఖ్యలపై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పందించారు. "అధికారులు మీకు సహకరించడంలేదని నిప్పులు చెరుగుతున్నారు కదా...! మీరు అధికారంలోనే ఉన్నారు కదా...! ఇప్పుడు మాకు అనుమానం వస్తోంది. మీరు వెళితే సహకరించవద్దని అధికారులకు చంద్రబాబు గానీ చెప్పారా? లేక, లోకేశ్ గానీ చెప్పారా?

21 సీట్లలో పోటీ చేస్తే 21 సీట్లలో తన పార్టీని గెలిపించిన వ్యక్తి, 100 పర్సెంట్ స్ట్రయిక్ రేట్ ఉన్న వ్యక్తి... పవన్ కల్యాణ్. అలాంటి వ్యక్తి తనకు అధికారులు సహకరించడంలేదని చెబుతున్నాడు. అధికారులు సహకరించకపోతే మీరు ఏంచేయాలి? మీరు ప్రభుత్వంలో ఉన్నారా, లేక ఇంకా ప్రశ్నించే ధోరణిలో ఉన్నారా? అనేది ఆలోచించుకోవాలి.

మీరు కాకినాడ వెళ్లి సినిమా షూటింగ్ తరహాలో డ్రామా కార్యక్రమం చేశారు తప్ప, పీడీఎస్ బియ్యంను ఆపాలన్న చిత్తశుద్ధితో మీరు వెళ్లలేదు. పీడీఎస్ బియ్యం పంపిణీ కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.11 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. కానీ, మీ ఎమ్మెల్యేలు వాటాలు తీసుకుని ఈ బియ్యం ఎగుమతులు చేస్తున్నారు. మీరు మాత్రం కాకినాడ వెళ్లి అక్కడి ఎస్పీ మీద, అధికారుల మీద కేకలు వేస్తున్నారు.

కాకినాడ పోర్టులో రెండు చెక్ పోస్టులు ఉన్నాయి. ఈ రెండు చెక్ పోస్టులు పౌరసరఫరాల శాఖకు చెందినవి. ఆ పౌరసరఫరాల శాఖను మీ పక్కన కూర్చున్న మనోహర్ గారు నిర్వహించడం లేదా? ఆయన మీ పార్టీకి చెందినవారు కాదా? ఈ స్కాం నిజమైతే ముందు పౌరసరఫరాల శాఖ మంత్రి రాజీనామా చేయాలి. ఆ తర్వాత మీరు రాజీనామా చేయాలి.

కానీ మీరు బాధ్యతలను విస్మరించి, ఎవరిపైనో విమర్శలు చేస్తున్నారు. ఓడిపోయిన చంద్రశేఖర్ రెడ్డిపై విమర్శలు చేయడం వల్లే ఏమిటి ప్రయోజనం? మీరు ఇప్పుడు దారుణమైన పరిస్థితుల్లో ఉన్నారు. మిమ్మల్ని మీరే విమర్శించుకుంటున్నారు... ఆ ఎస్పీని మీరే విమర్శిస్తారు, పౌరసరఫరాల శాఖను కూడా మీరే విమర్శిస్తారు, ఈ ప్రభుత్వాన్ని మీరే విమర్శిస్తారు... ప్రభుత్వంలో బాధ్యత మాదే అని చెబుతారు కానీ, ఆ బాధ్యతను చేపట్టే స్థితిలో లేరు... ఈ పరిస్థితి చాలా విచిత్రంగా అనిపిస్తోంది.

ఈ సందర్భంగా నాకు ఓ సినిమా డైలాగ్ గుర్తుకువస్తోంది. నాకు తిక్కుంది... దానికో లెక్కుంది... కానీ ఇదంతా చూస్తే మీకు లెక్కలేనంత తిక్కుందని నాకు అర్థమవుతోంది" అంటూ పవన్ కల్యాణ్ పై అంబటి రాంబాబు విమర్శనాస్త్రాలు సంధించారు.

# పేదలపై ఫీజుల పిడుగు

విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లలో ప్రవేశాలు కల్పించే నిమిత్తం గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసింది. ఆ జీవో బాలల రక్షణ జాతీయ కమిషన్ జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లకు (ఎస్వోపీ) విరుద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఆర్టీఈ చట్టం ఉద్దేశాన్ని జీవో 24ను నెరవేర్చకపోగా నీరు గార్చేదిగా ఉందని పేర్కొంది. 25 శాతం సీట్ల కోటాలో చేరే పిల్లలకు ఫీజుల నిర్ణయం విషయంలో పిటిషనర్ల భాగస్వామ్యం పక్షాల అభ్యంతరాలు, సూచనలను ప్రభుత్వ పరిగణనలోకి తీసుకోలేదని ఆక్షేపించింది. ఆ జీవోను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిధిలోకి తీసుకోకుండా ఫీజులను ఖరారు చేశారని పిటీషన్‌లో పేర్కొన్నట్లు తెలిపింది. విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజులను అమ్మఒడి పథకం కింద తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రభుత్వం చెప్పడం చట్టవిరుద్ధంగా ఉందని అభిప్రాయపడింది.

**జిల్లాలో 3,906 మంది అడ్మిషన్లు**

విద్యా హక్కు చట్టం కింద కర్నూలు జిల్లాలో 2022-2023 నుంచి 2024-2025 విద్యా సంవత్సరం వరకు మూడు సంవత్సరాల్లో 25 శాతం సీట్ల కింద మొత్తం 5,634 సీట్లు కేటాయించారు. ఇందులో 3,906 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా 1728 మంది వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరలేదు. 2022-2023 విద్యా సంవత్సరంలో జిల్లాలో 183 సీట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు కేటాయించారు. ఇందులో 158 మంది వివిధ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందగా మరో 25 మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరలేదు. అలాగే 2023-2024 విద్యా సంవత్సరంలో 2,119 సీట్లు కేటాయించగా 1395 మంది చేరగా 724 మంది చేరలేదు. 2024-2025 విద్యా సంవత్సరంలో 3,332 సీట్లు కేటాయించారు. 2353 మంది పాఠశాలలో చేరగా 979 మంది అడ్మిషన్లు పొందలేదు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 24ను హైకోర్టు రద్దు చేసింది. ఆర్టీఈ చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలి. ఆర్టీఈ చట్టం కింద అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఏడాదికి ఒక్కొక్క విద్యార్థికి అర్బన్ ప్రాంతంలో రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతంలో రూ.6,500, ట్రైబల్ ఏరియాలో రూ.4వేలు మాత్రమే ఫీజులు చెల్లించేలా నిర్ణయించారు.

**పేద విద్యార్థులకు భారంగా మారిన విద్య**

గత ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేయడంతో కార్పొరేట్ విద్య పేద విద్యార్థులకు భారంగా మారింది. పూర్తి ఫీజులు చెల్లించాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. అర్ధాంతరంగా జీవో రద్దు కావడంతో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నెత్తిన పిడుగు పడినట్లయింది. వేలకు వేలు ఫీజులు చెల్లించలేకనే ప్రభుత్వం ఆర్టీఈ కింద నామమాత్రపు ఫీజుతో అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తే చేర్పించామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని తాము భారీ మొత్తంలో ఫీజులు ఎలా చెల్లించగలమని ప్రశ్నిస్తున్నారు.

**ఇది అనాలోచిత నిర్ణయం**

గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం తీసుకుంది. ఈ జీవో సరైంది కాదని గతంలోనే చెప్పాం. అయినా బలవంతంగా జీవోను జారీ చేసింది. ఆర్టీఈ కింద అడ్మిషన్లు పొందిన పిల్లల ఫీజులు గత ప్రభుత్వం చెల్లించలేదు. ఈ ఏడాది సంబంధించి ఇప్పటి వరకు పైసా కూడా ఇవ్వలేదు. ఈ విద్యార్థులకు సంబంధించిన ఫీజులు ప్రభుత్వం, ఇటు తల్లిదండ్రులు ఇవ్వకపోతే తమ పాఠశాలలు ఎలా నడపాలి. కోర్టు తీర్పును మేం స్వాగతిస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న ఫీజులను ప్రభుత్వం చెల్లించాలి. చట్టం వేరు.. జీవో వేరు.. ఒకదానికొకటి ముడి పెట్టడం ఏమిటి?

**- కర్నూలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ఆపుస్మా) జిల్లా అధ్యక్షుడు బి. వాసుదేవయ్య**

**ఈ విద్యా సంవత్సరానికి కొనసాగేలా చూస్తాం**

విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులపై అదనపు ఫీజుల భారం పడకుండా ఈ విద్యాసంవత్సరం పూర్తయ్యే వరకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారులను కోరుతాం. ఆర్టీఈ చట్టం కింద చేరిన విద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి చేయవద్దని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లకు చెప్పాం. ఇది ప్రభుత్వ నిర్ణయం. రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాలు వస్తే బావుంటుంది.

# మాజీ మంత్రి రోజాపై పోలీసులకు ఫిర్యాదు చేసిన దళిత సంఘాలు

ఉమ్మడి గుంటూరు జిల్లా బాపట్లలోని సూర్యలంక బీచ్ లో దళిత ఉద్యోగితో చెప్పులు మోయించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆమెపై పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలుస్తోంది.

వివరాల్లోకి వెళితే... 2023 ఫిబ్రవరిలో సూర్యలంక బీచ్ కు పర్యాటక మంత్రిగా ఉన్న రోజా వెళ్లారు. ఆమె సముద్రపు నీటిలోకి దిగే ముందు ఒడ్డున చెప్పులు వదిలారు. చెప్పులను జాగ్రత్తగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో, పర్యాటక శాఖ రిసార్ట్స్ లో పని చేస్తున్న ఒక ఉద్యోగి ఆమె చెప్పులను మోశారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ క్రమంలోనే... దళితులను రోజా అవమానించారంటూ కర్నూలు పోలీస్ స్టేషన్ లో ఈరోజు దళిత సంఘాలు ఫిర్యాదు చేశాయి.

## రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ తత్వం బోధపడినట్లుగా ఉంది: హరీశ్ రావు

అని ప్రశ్నించారు. నిరూపించలేని పక్షంలో సీఎం పదవికి రాజీనామా చేయాలని సవాల్ చేశారు. అబద్ధాలు చెబుతూ ఏడాది పాలనలో అన్ని వర్గాలను మోసం చేశారని ఆరోపించారు. ఈ అబద్ధాలతో ఇంకా ఎంతో కాలం మోసం చేయలేవన్నారు.

అసెంబ్లీకి రమ్మని రేవంత్ రెడ్డి తమను తెగ పిలుస్తున్నాడని... ఆ సమయం కోసమే తాము కూడా ఎదురు చూస్తున్నామని చెప్పారు. అసెంబ్లీలో నీ ఏడాది పాలన అసలు రంగు బయట పెట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందన్నారు. అసెంబ్లీలో మైకులు కట్ చేయకుండా సమయం కేటాయించే దమ్ము మీకుందా? అని ప్రశ్నించారు.

# ఖాతా.. కంగారు!

**ఏలూరు** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు రాయితీ సొమ్మును నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసేందుకు అవసరమైన జాతీ య చెల్లింపుల సంస్థ (ఎన్‌పీసీఐ)ని ఖాతాలకు అనుసంధానం చేయడంపై క్షేత్రస్థాయిలో అపో హలు, సందేహాలు విస్తృతం కావడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు పోస్టాఫీసులకు ఎగబడుతు న్నారు. బ్యాంకు లేదా పోస్టాఫీసు పొదుపు ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధానమైతేనే ప్రభుత్వ పథకాల రాయితీ సొమ్ము జమ అవుతుందని కొంతకాలం క్రితమే ప్రభుత్వం ప్రకటించినా రానున్న కొద్దిరోజుల వ్యవధిలోనే రాష్ట్రప్రభుత్వం నుంచి రాయితీ నిధులు లబ్ధిదారుల ఖాతాలకు జమ కానున్నట్టు ప్రచారం జరగడంతో ఒక్క సారిగా రద్దీ కొన్నిరెట్లు పెరగడానికి కారణమైంది. జిల్లాలో ప్రస్తుతం ఆర్థికలావాదేవీలు కొనసాగుతూ లైవ్‌లోవున్న బ్యాంకు, పోస్టాఫీసు మొత్తం పొదుపు ఖాతాల్లో 1.61 లక్షలు ఎన్‌పీసీఐకి అనుసంధానం కాలేదని ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) జిల్లా మేనేజర్ రాజేశ్ శనివారం వెల్లడించారు. ఈ ఖాతాలను తిరిగి లావాదేవీలకు పనికి వచ్చేలా లైవ్‌లోకి తీసుకురావాలంటే సంబంధిత బ్యాంకుకు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని తీసుకెళ్ళి, కొంత నగదు మొత్తాన్ని జమచేసిన తర్వాత అభ్యర్థన పత్రాన్ని అందజేస్తే నిబంధనల మేరకు ఖాతాను మళ్ళీ లైవ్‌లోకి తీసుకొస్తారు. అలాకాకుంటే కొత్తగా బ్యాంకు పొదుపు ఖాతాను తెరవాలనుకుంటే బ్యాంకు నిబంధనలు, షరతులను బట్టి రూ.500ల నుంచి రూ.2వేలు చెల్లించి, అవసరమైన ధ్రువపత్రాలు, అభ్యర్థన దరఖాస్తును అందజేస్తే కొత్త ఖాతాను తెరుస్తారు. అంతమొత్తాన్ని చెల్లించే స్థోమతలేని వారికి రూ.200 చెల్లింపుతో పోస్టాఫీసులో కేవలం ఆధార్ కార్డు వివరాలు, వేలిముద్ర తీసుకుని పేపర్‌లెస్ పద్ధతిన అక్కడికక్కడే కొత్తఖాతాను తెరిచే వీలుండటంతో కొద్దిరోజులుగా ప్రజలు పోస్టాఫీసులకు బారులు తీరుతున్నారు.

**సచివాలయాల్లో ఎన్‌పీసీఐ లింక్ కాని లబ్ధిదారుల జాబితాలు**

జిల్లాలోని అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, కార్యదర్శులకు వారి పరిధిలో ఎన్‌పీసీఐకి అనుసంధానం కాని లబ్ధిదారుల వివరాలను ఇప్పటికే ప్రభుత్వం పంపించింది. కనీసం పదిమంది ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేయాల్సి ఉంటే అక్కడికే పోస్ట్‌మ్యాన్‌ను పంపించి లింక్ చేయించే వెసులుబాటు కల్పించారు. అయినప్పటికీ తమ బ్యాంకు పొదుపు ఖాతాలు లైవ్‌లో ఉన్నదీ, లేనిదీ పరిశీలించుకోకుండానే ప్రజలు అపోహలతో పోస్టాఫీసులకు వెల్లువెత్తుతున్నారని తపాలా అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో కొందరు ప్రస్తుతం వున్న బ్యాంకు ఖాతాలు ప్రభుత్వ రాయితీ సొమ్మును పొందేందుకు పనికిరావని పోస్టాఫీసులో కొత్తగా ఖాతాను తెరవాల్సిందేనని చేస్తున్న దుష్ప్రచారం కూడా పోస్టాఫీసుల్లో రద్దీ అమాంతం పెరగడానికి కారణంగా తెలుస్తోంది.

**పోస్టాఫీసులకు రానక్కర్లేదు..**

బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలు పని చేస్తుంటే ఎన్‌పీసీఐకి అనుసంధానం అయి వున్నట్టే. ఈ విషయం తెలియక చాలా మంది గ్రామాల నుంచి పోస్టాఫీసులకు వస్తున్నారు. జిల్లాలో ఎన్‌పీసీఐకి లింక్‌కాని 1.61 లక్షల ఖాతాల్లో పదేళ్ల లోపు వయస్సు వున్న పిల్లలు, ఇతరప్రాంతాలకు వలస వెళ్ళిపోయినవారు, ఇక్కడకువచ్చిన వలస ప్రజలు, చనిపోయిన వ్యక్తులు ఉన్నారు. ఇటువంటివారి ఖాతాలను అనుసంధానం చేయడం సాధ్యం కాదు. ప్రజలు ముందు గా తమ పరిధిలోని సచివాలయా నికి వెళ్ళి అక్కడి జాబితాలో ఉన్నదీ, లేనిదీ పరిశీలిం చుకోవాలి. బ్యాంకు ఖాతా ఉంటే సంబంధి త బ్యాంకుకు వెళ్ళి నిబంధనల మేరకు ఖాతాను పునరుద్ధరించుకుంటే సరిపోతుంది. కొత్తగా పోస్టాఫీసు పొదుపు ఖాతా అవసరమనుకున్న వారు మాత్రమే సచివాలయ వెల్ఫేర్ అసిస్టెం ట్ లేదా కార్య దర్శికి తెలిపితే స్థానిక పోస్ట్ మాస్టర్ దృష్టికి తీసుకెళ్లి అక్కడికే పోస్ట్‌మ్యాన్ ను పంపించి ఖాతాను తెరిపిస్తారు. ఇందుకు రూ.200 మినహా అదనంగా చెల్లించనవసరం లేదు. ఎన్‌పీసీఐకి అనుసంధానం చేసి పాత పోస్టల్ ఖాతాను పునరుద్ధరించడానికి ఎటువంటి రుసుం పోస్ట్‌మ్యాన్‌కు చెల్లించనక్క ర్లేదు. ఇప్పటికిప్పుడు ప్రభుత్వ పథకాల రాయితీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నారన్నది అవాస్తవం. గత ఐదు రోజుల్లో జిల్లావ్యాప్తంగా మూడు వేల ఖాతాలను ఎన్‌పీసీఐకి అనుసంధానం చేశాం.



## ఇలాంటి కేసులు ఎన్నో చూశాం: గౌతమ్ అదానీ

రాజస్థాన్ రాజధాని జైపూర్ లో జరిగిన జెమ్ అండ్ జ్యుయెలరీ అవార్డుల ప్రదానోత్సవంలో అదానీ గ్రూప్ సంస్థల అధినేత గౌతమ్ అదానీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తమపై అమెరికాలో కేసులు నమోదు కావడం పట్ల ఆయన స్పందించారు. ఇలాంటి కేసులు ఎన్నో చూశామని అన్నారు. అదానీ గ్రూప్ కు ఇలాంటి కేసులను ఎదుర్కోవడం కొత్త కాదని స్పష్టం చేశారు.

ఇలాంటి సమస్యలు, దాడులు తమను మరింత దృఢంగా మార్చుతాయని గౌతమ్ అదానీ పేర్కొన్నారు. మా సంస్థకు ఎదురయ్యే ప్రతి అడ్డంకి ఒక విజయసోపానంగా మారుతుంది అని వ్యాఖ్యానించారు.

భారత్ లో సోలార్ ఎనర్జీ ఒప్పందాలు కుదుర్చుకునేందుకు లంచాలు ఇచ్చినట్టు అదానీ గ్రూప్ సంస్థలపై ఇటీవల ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ ఆరోపణలతో అమెరికాలో కేసులు నమోదు కాగా, భారత్ లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది.

# కేడీసీసీ బ్యాంకు కుంభకోణంలో మరో బ్యాంకు ఉద్యోగి పై వేటు ...

పట్టణంలోని కేడీసీసీ బ్యాంకు కుంభకోణంలో మరో అధికారి అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ శంకర్ ను సస్పెండ్ చేసినట్లు జిల్లా బ్యాంక్ అధికారులు తెలిపారు. గతంలో 80 లక్షల భారీ కుంభకోణం కేడీసీసీ బ్యాంకులో బయటపడింది. అందులో భాగంగా ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో ముగ్గురు బ్యాంక్ అధికారులపై కేసు నమోదు చేశారు. అయితే కుంభకోణంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరింత లోతుగా పరిశీలించి అసిస్టెంట్ మేనేజర్ శంకర్ పాత్ర ఉన్నట్లు గుర్తించారు. అందుకే ఆయనను విధుల నుంచి తొలగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. శనివారం రాత్రి పొద్దుపోయేంతవరకు ఆత్మకూరు కేడీసీసీ బ్యాంకులో ఉన్నతాధికారులు వుండి కుంభకోణంపై ఆరా తీస్తున్నారు. బ్యాంకు కుంభకోణం పై మరింత మంది ఉద్యోగులపై చర్యలు తీసుకునేందుకు బ్యాంకు ఉన్నతాధికారులు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది.

# కేసీఆర్, మోదీకి సీఎం రేవంత్ సవాల్

రైతు బిడ్డగా పాలమూరు రైతుల కష్టాలు తనకు తెలుసునని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతులు ప్రతిపక్షాల ట్రాప్‌లో పడవద్దని అన్నారు. రుణమాఫీపై చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్ధమా అని సవాల్ విసిరారు. ఇవాళ(శనివారం) మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం రేవంత్ పాల్గొని ప్రసంగించారు. రైతుల కోసం రూ.54 వేల కోట్లు ఖర్చు పెట్టామని అన్నారు. రైతుల కోసం ఇంకా కేటాయించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. గతేడాది నవంబర్ 30వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని తెలిపారు. దొరల గడీలను కూల్చారని చెప్పారు. పాలమూరులో కృష్ణమ్మ పారుతున్నా ప్రజల కష్టాలు తీరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం ముంబై, హైదరాబాద్‌కు వలసలు పోయే పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

**బీఆర్ఎస్ మోసం చేసింది..**

మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తర్వాత... ఇన్నాళ్లకు మళ్లీ పాలమూరు బిడ్డ సీఎం అయ్యారని గుర్తుచేశారు. తనకు వచ్చిన అవకాశాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తున్నానని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్లందరూ జూనియర్ అయినా తనకు సహకరిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతురుణమాఫీని పూర్తి చేసిందా అని ప్రశ్నించారు.వడ్డీతో సహా రూ.లక్ష రుణమాఫీ చేస్తామని బీఆర్ఎస్ మోసం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చింది వడ్డీలకు కూడా సరిపోలేదన్నారు. వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్లే అని కేసీఆర్ అనలేదా అని నిలదీశారు.

**రైతులకు పండుగ తెచ్చాం..**

తమ ప్రభుత్వం మాత్రం వరి వేస్తే.. రూ.500 బోనస్ ఇచ్చి.. వరి రైతులకు పండుగ తెచ్చిందని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరానికి రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. మూడేళ్లు నిండకుండానే కాళేశ్వరం కూలిందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది తెలంగాణలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని తెలిపారు.దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రుణమాఫీ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. సాగుకు ఉచిత కరెంట్ పేటెంట్ హక్కు కాంగ్రెస్‌దేనని తెలిపారు. ఎవరెవరో వచ్చి పాలమూరును దత్తత తీసుకుంటానని ప్రకటించారని.. ఆయన ఈ జిల్లాకు చేసిందేమీ లేదని అన్నారు. మన ప్రాజెక్టులకు నిధులు ఇచ్చేందుకు కేసీఆర్‌కు మనసు రాలేదని.. ఎంపీగా గెలిపించిన జిల్లాకు కేసీఆర్ ఏం చేశారో చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

**అభివృద్ధిని అడ్డుకోవద్దు**

"గతంలో ఎవరూ భూసేకరణ చేయలేదా. ...ప్రాజెక్టులు కట్టలేదా.. పరిశ్రమలు నిర్మించలేదా. నా జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి.. ప్రజలకు ఉపాధి కల్పించాలని భావించాను. మాయగాళ్ల మాటలు విని పరిశ్రమలను అడ్డుకుంటున్నారు. మాయగాళ్ల మాటలు విని లగచర్ల ప్రజలు కేసుల్లో ఇరుకున్నారు. జిల్లాను అభివృద్ధి చేయాలంటే భూసేకరణ చేయాలా.. వద్దా. అధికారులను కొడితే శ్రీశైలం.. సాగర్ ప్రాజెక్టులు పూర్తయ్యేవా. మాయమాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు. కేసీఆర్‌కే గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్ హౌస్ ఉంది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు పెద్దపెద్ద ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. ప్రజలను రెచ్చగొట్టి కేసుల పాల్జేసి వాళ్లు వెళ్లి ఫామ్‌హౌస్‌లో ఉంటారు. కేసీఆర్ చేసిన దోపిడీకి ప్రజలు, కాంగ్రెస్ ప్రభుత్వం బలైపోయింది. మల్లన్నసాగర్‌లో భూమి పోతే రైతు చితిపేర్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు మల్లారెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ న్యాయం చేసిందా. భూములు కోల్పోతున్నవారు పరిహారం అడగండి ఇస్తాను. కావాలంటే ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అయినా ఇస్తాం.మాయగాళ్ల మాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఫెంగల్ తుపాను ఎఫెక్ట్... తెలుగు రాష్ట్రాల నుంచి పలు విమాన సర్వీసులు రద్దు

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను కారణంగా చెన్నై, తిరుపతి నగరాల్లో విమానాల రాకపోకలకు ప్రతికూల వాతావరణం ఏర్పడింది. దీని ప్రభావంతో ఏపీ, తెలంగాణ నుంచి పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన ఏడు విమానాలు రద్దు చేశారు. అదే సమయంలో, తిరుపతి నుంచి హైదరాబాద్ రావాల్సిన ఏడు విమానాలు కూడా రద్దయ్యాయి.

అటు, చెన్నై నుంచి హైదరాబాద్ రావాల్సిన మూడు విమానాలు రద్దయ్యాయి. ముంబయి, ఢిల్లీ నుంచి చెన్నై వెళ్లాల్సిన రెండు విమానాలను దారి మళ్లించారు. చెన్నై-విశాఖ-చెన్నై, తిరుపతి-విశాఖ-తిరుపతి విమాన సర్వీసులు కూడా ప్రతికూల వాతావరణం కారణంగా నిలిచిపోయాయి.

ఫెంగల్ తుపాను కారణంగా చెన్నైలో భారీ వర్షాలతో వరదలు ముంచెత్తాయి. దాంతో విమానాశ్రయాన్ని మూసివేశారు.

# డిసెంబర్ 5న మహారాష్ట్ర సీఎం ప్రమాణ స్వీకారం!

దేవేంద్ర ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ సమావేశం కావాల్సి ఉండగా... షిండే హఠాత్తుగా తన స్వగ్రామానికి వెళ్లిపోయారు. దీంతో సమావేశం రద్దైంది.

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి ఆరు రోజులు కావొస్తున్నప్పటికీ బీజేపీ ఎమ్మెల్యేల సమావేశాన్ని నిర్వహించి... పార్టీ శాసనసభాపక్ష నేతను ఎన్నుకోలేదు.

అయితే కొత్త సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం డిసెంబర్ 5న ఆజాద్ మైదాన్‌లో నిర్వహించే అవకాశం ఉందని బీజేపీ, శివసేనకు చెందిన నేతలు చెప్పినట్లు 'ది హిందూ' పత్రిక వెల్లడించింది."బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ. పార్టీ శాసనసభాపక్ష నేత, సీఎం అంశానికి సంబంధించి ఇద్దరు కేంద్ర పరిశీలకులను నియమిస్తుంది. ఈ పరిశీలకులు ముంబైకి వచ్చి ఎమ్మెల్యేలతో సమావేశమవుతారు. శాసనసభాపక్ష నాయకుడిని ఎన్నుకున్న తర్వాత మేం గవర్నర్‌ను కలుస్తాం" అని బీజేపీకి చెందిన సీనియర్ నేత ఒకరు చెప్పారు.

# పారదర్శకంగా ప్రత్యేక ఓటరు జాబితాను రూపొందించాలి



**జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు**

**ఫిర్యాదుల విచారణ పారదర్శకంగా చేపడుతున్నాం : జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**కడప, చీఫ్ బ్యూరో నవంబర్ 30 పల్లె వెలుగు** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2024లో భాగంగా ప్రత్యేక ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కె. కన్నబాబు (రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి) ఈఆర్వోలు, ఏఈఆర్వోలను ఆదేశించారు.కడప కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ లో శనివారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2025 లో భాగంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితి సింగ్ లతో కలిసి.. జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కన్నబాబు మాట్లాడుతూ... ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల కమీషన్ ప్రక్రియ, నిబంధనలు అమలు చేయాలన్నారు. దేశంలో పెద్ద ఎత్తున జరిగే ఎన్నికల నిర్వహణలో చిన్న తప్పు జరగకుండా ఉండాలంటే ఎన్నికల కమీషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని నూతన ఓటర్లుగా నమోదులో వివరాలు.పక్కాగా నమోదు చేయాలన్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనలు పాటిస్తే తప్పులు జరిగేందుకు అవకాశం ఉండదన్నారు. బిఎల్వోలు క్షేత్రస్థాయిలో 100 శాతం ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. ప్రతి ఓటర్ల బిఎల్వోలకు పరిశీలన చేయాలని, బిఎల్వోలకు శిక్షణ కూడా ఇవ్వాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు వారి ఫిర్యాదులను ముందుగానే అందించాలని, క్షేత్రస్థాయిలో నాయకులకు తెలియజేసి అందరూ సహకరించేలా చూడాలన్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి మెజారిటీ క్లెయిమ్స్, డిస్పోజల్స్ పూర్తి చేయాలన్నారు. ఫామ్-7 దరఖాస్తులను కమీషన్ నిబంధనలు పాటించి తొలగించాలన్నారు. పూర్తిగా 100 శాతం ప్రతి ఒక్క క్లెయిమ్, అభ్యంతరాలు ఖచ్చితంగా పరిశీలన జరగాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు అందించిన ఫిర్యాదులపై కూడా పరిశీలన తప్పనిసరిగా చేయడం జరుగుతుందని, బిఎల్వోలు మళ్లీ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేస్తారన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా రూపొందించడం జరుగుతుందన్నారు.

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ..** ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధుల నుండి అందిన ఫిర్యాదుల విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపడుతున్నామన్నారు. ఎన్నికల కమిషన్ సూచనలు పాటించి నిబంధనల మేరకు క్లెయిమ్స్ పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 16,41,347 మంది ఓటర్లు ఉన్నారని.. ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8కు సంబంధించి వచ్చిన క్లెయిమ్స్ ను పరిశీలించడం జరుగుతోందన్నారు. నవంబర్ 24వ తేదీలోపు వచ్చిన క్లెయిమ్స్, అభ్యంతరాల ఫిర్యాదులను 29వ తేదీ నుండి గ్రామ పంచాయతీ, మండల, నియోజకవర్గ, రెవిన్యూ డివిజన్,



జిల్లా స్థాయిలో విచారణ చేసి పరిష్కరించి.. 2025 జనవరి 1వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి ఫిర్యాదుల విచారణ చేసి పరిష్కరిస్తున్నామన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటరును కూడా తొలగించకుండా చర్యలుచేపడుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా క్లెయిమ్స్, అభ్యంతరాల విషయమై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. 01.01.2025 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఈ విషయమై రాజకీయ పార్టీల నాయకులు కూడా యువకులకు తెలియజేయాలన్నారు. ఈవీఎంలు ఏ విధంగా ఉపయోగించాలి, ఓటింగ్ విధానంపై అవగాహన చేపడుతున్నామన్నారు. ఫిర్యాదుల పరిష్కారం పారదర్శకంగా జరుగుతోందని, తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకుల సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ శ్రీనివాసులు, కడప ఇంచార్జి ఆర్డీవో వెంకటపతి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# ఇది ప్రజల సంక్షేమ ప్రభుత్వం

**-ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు తూచా అమలు**

**-పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి ఫరూక్**







**నంద్యాల బ్యూరో. నవంబర్ 30 .పల్లె వెలుగు** :ఇది ప్రజల సంక్షేమ ప్రభుత్వమని రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను సగర్వంగా నిర్వహిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి మాసం నుంచే ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను పెంచి ప్రతినెలా ఒకటో తేదీన పంపిణీ చేస్తున్నామని అన్నారు. డిసెంబర్ 1 ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే ప్రభుత్వం నవంబర్ 30 నే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు . అందులో భాగంగా శనివారం నంద్యాల నియోజకవర్గం లోని 29 వ వార్డు టిడిపి ఇంచార్జ్ మంజుల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో షాదిక్ నగర నందు మంత్రి ఫరూక్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రజల తరపున మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్ల పెంపు తో పాటు మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని తెలిపారు అంతేకాకుండా గత వైసిపి ముఖ్యమంత్రి జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దుచేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర అధ్వానంగా ఉన్న రోడ్లను కూటమి ప్రభుత్వం బాగు చేయించే కార్యక్రమాన్ని కూడా చేపట్టిందని గుర్తు చేశారు. గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టి పంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చూస్తుందని మంత్రి ఫరూక్ తెలిపారు. టీడిపి ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను దశల వారీగా ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. గత ఐదేళ్ల జగన్ మోహన్ రెడ్డి పాలన మొత్తం అవినీతి మయం అన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు, రంగాలను వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 5 మాసాల్లోనే రాష్ట్రంలో అభివృద్ధి ,సంక్షేమం రెండు కళ్లలా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి , కౌన్సిలర్ శ్రీదేవి , వాకా శివశంకర్ యాదవ్ , గుద్దేటి వెంకటేశ్వర్లు , జెపి , బ్యాంక్ తిమ్మయ్య , చాబోలు ఇలియాజ్ , బద్రిశెట్టి రవికుమార్ , నాగరత్నమ్మ , సాయిరాం , జ్యోతి రాయల్ , వేద సాయి , సంపంగి జయకృష్ణ , మంజుల సుధాకర్ , నరేష్ మరియు సచివాలయ సిబ్బంది , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జగజ్జనని నగర్ లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ



**- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్**

**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 30 .పల్లె వెలుగు** ):నంద్యాల పట్టణం 6 వ వార్డు జగజ్జనని నగర్ లో లబ్ధిదారులు ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీ చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మరియు తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్. రాష్ట్రంలోని ప్రతి ఒక్క పేదవాని ముఖంలో ఆనందం చూడడమే ప్రభుత్వ ధ్యేయమని అందుకు తగ్గట్టుగా ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛను అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి ఆదేశాల మేరకు పింఛన్లు పంపిణీ చేసామని తెలిపారు. దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు ఇలా ప్రతి ఒక్కరికి పింఛన్లు అందించి వారికి అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందనీ, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల



ఊబిలోకి నెట్టేసిందని అయినా కూటమి ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపించేందుకు తీవ్రస్థాయిలో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఖాజా హాఫిజ్, తెలుగుదేశం పార్టీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రషీద్, అమీర్ వినోద్ మొదలైన వారు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి



**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**కడప, చీఫ్ బ్యూరో నవంబరు 30 పల్లె వెలుగు** జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం స్థానిక కలెక్టరేట్ సభాభవన్ లో సాగునీటి వినియోగదారుల సంఘ ఎన్నికల నిర్వహణపై.. జిల్లా నీటి వనరుల శాఖ, మండల అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించి.. ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని వంద ఎకరాలకు పైబడి ఆయకట్టు కలిగిన చెరువులకు సంబంధించి డిసెంబర్ 8న నీటివినియోగదారుల/సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అందుకు సంబంధించి డిసెంబరు 5న సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన వెలువడనుందన్నారు. డిసెంబరు 8న ఒకే రోజు పూర్తి ఎన్నికల ప్రక్రియ ఉంటుందని, ఇందులో నామినేషన్ల ప్రక్రియ, 6 మంది ప్రాదేశిక సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. మైనర్, మీడియం, మేజర్ అనే మూడు కేటగిరీల నీటి వనరులకు ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో 3 ప్రాజెక్టు కమిటీలు, 11 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 205 నీటి వినియోగదారుల కమిటీలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ ఎన్నికలను పార్టీలకతీతంగా సుహృద్భావ వాతావరణంలో వీలైనంత వరకు ఏకగ్రీవ తీర్మానాలతో జరపాలని ప్రభుత్వం భావిస్తుందని ఆ మేరకు జిల్లాలో కూడా అన్ని శాఖల అధికారులు పటిష్టంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఎన్నిక అనంతరం ఆయా సాగునీటి సంఘాల ద్వారా రైతులు తమ చెరువులను తామే ప్రభుత్వ సహకారంతో నిర్వహించుకోగలుగుతారన్నారు. ప్రతి సాగునీటి సంఘంలో 6 మంది ప్రాదేశిక సభ్యులు ఎన్నికవుతారని, ప్రాదేశిక సభ్యుల నుంచే ఒక అధ్యక్షులు, ఒక ఉపాధ్యక్షులు ఎన్నికవుతారన్నారు. ఈ ఎన్నికలలో పోటీ చేయడానికి, స్థానిక సంస్థల ఎన్నికలకు కావలసిన అన్ని సాదారణ అర్హతలతో పాటు.. పెండింగ్ లేకుండా నీటి తీరువా చెల్లించిన రైతులు మాత్రమే అర్హులన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించి.. ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు బాధ్యతగా.. విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా మండల తహసీల్దార్లు కీలక బాధ్యత వహించాలన్నారు.



మండల.ఎస్.హెచ్.ఓ. లతో సమన్వయం చేసుకుని.. లా అండ్ ఆర్డర్ ను పక్కాగా అమలు పరచాలన్నారు. భద్రతకు సంబంధించి.పోలీసు యంత్రాంగం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఎన్నికల్లో ఎన్నికల వీధుల నిర్వహణపై పిపిటి ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితి సింగ్, డిఆర్ఓ శ్రీనివాసులు, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డీఈవో మీనాక్షి, తాసిల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులు, అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల కమీషనర్లు, ప్రత్యేక అధికారులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పోలీసు అధికారులు ఎన్నికల విధులకు హాజరయ్యే పోలింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం నిర్వహించిన కార్తికమాస వనభోజన మహోత్సవంలో ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

**ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ని సన్మానించిన మంత్రులు, ఎమ్మెల్యేలు.**



**డోన్,పల్లె వెలుగు నవంబర్ :30** శ్రీ బుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానం నందు తెలుగుదేశంపార్టీ నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షులు, టిటిడి మెంబర్ మల్లెల రాజశేఖర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన "కార్తికమాస వనభోజన మహోత్సవంలో" ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ని మరియు నంద్యాల జిల్లాలో నామినేటెడ్ పదవులు వచ్చిన వారికి. మంత్రులు, ఎమ్మెల్యే లు, టిడిపి నాయకులు శాలువా,పూల బుకే తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు బి.సి.జనార్దన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు ఎన్.ఎండి.ఫారుక్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, మాండ్రా శివానంద రెడ్డి, గౌరు వెంకటరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తోపాటు నంద్యాల జిల్లా లోని టిడిపి నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు.



# న్యూమోనియా బాధితురాలికి ఆర్థిక సాయం అందించిన స్ఫూర్తి సేవా సమితి

**కష్టాల్లో ఉన్నావారిని ఆదుకోవడం మానవ ధర్మం**



**పల్లె వెలుగు నవంబర్ :30** డోన్ పట్టణ పాతబుగ్గ శివాలయం పూజారి అనిల్ శర్మ భార్య నందిని న్యూమోనియా వ్యాధిని ఆసుపత్రిలో చూపించుకోవడానికి ఆర్థిక పరిస్థితి బాగాలేక స్థానికుల ద్వారా తెలుసుకున్న స్ఫూర్తి సభ్యులు దాతల సహకారంతో 30 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని శనివారం నాడు అనిల్ శర్మ తల్లిదండ్రులకు అందించారు. నందిని ఆరోగ్య పరిస్థితి గురించి సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వెంటనే సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న దాతల దేవుళ్ళకు స్ఫూర్తి సభ్యులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్ట్ రమణ, స్ఫూర్తి సభ్యులు భాస్కర్, రాము, చంద్ర, దిలీప్, శివయ్య, పూల లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

# శని అమావాస్య- శ్రీ ఆంజనేయ స్వామి సింధుర అభిషేకం.



**బేతంచెర్ల నవంబర్ 30 పల్లె వెలుగు** బేతంచెర్ల పట్టణం లోగల శ్రీ గాడుబావి ఆంజనేయస్వామి దేవస్థానం నందు శని అమావాస్య సందర్భముగా ఆదివారం (01-12-2024) నాడు

ఉదయం 8 గంటలకు శ్రీ ఆంజనేయ స్వామి వారికి సిందూర అభిషేకం కార్యక్రమం నిర్వహింతురు..

**సాయంకాలం 6గంటలకు నాగ గౌరి మహిళలు**

కోలట కార్యక్రమంము మరియు పల్లకీ సేవా,అల్పహారం నిర్వహింతురు. ఈ సదావ కాశాన్ని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ గాడుబావి ఆంజనేయ స్వామి కృపకు పాత్రులు కాగలరని దేవస్థానం కమిటీ మరియు భక్త బృందం వారు తెలిపారు.







# క్యాన్సర్ ను మొదటి దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యం



## స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ద్వారా బాధితులకు సర్జరీలు, కీమోథెరపీ సేవలు

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు, పల్లె వెలుగు** .క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యం అని, జిల్లాలో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.

శనివారం కర్నూలు వైద్య కళాశాలలో నిర్వహించిన స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ తొలి సదస్సులో ప్రివెంటివ్ ఆంకాలజీ మరియు ప్యాలియేటివ్ కేర్ అన్న అంశంపై జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ కర్నూలు జిల్లాలో ఏర్పాటు కావడం చాలా గర్వకారణం అన్నారు. రాష్ట్ర క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ తొలి వార్షిక సదస్సు క్యాన్సర్ నివారణ, చికిత్సా విధానాలు, నూతన ఆవిష్కరణలను తెలియజేసే గొప్ప వేదికగా నిలిచిందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.. క్యాన్సర్ పై రీసెర్చ్, నివారణ తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయడానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని, కర్నూలు వైద్య కళాశాల వైద్య విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించి నివారణ చేసే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు..ఇందులో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు.. స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ద్వారా సర్జరీలు, కీమోథెరపీ వైద్య సేవలను అందించేందుకు సుమారు రూ.30 కోట్ల వ్యయంతో కూడుకున్న వైద్య పరికరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఏ విధమైన సహాయ సహకారాలు కావాలన్నా తన దృష్టికి తీసుకొని వస్తే, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.

స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీకృష్ణ ప్రకాష్ తన స్వాగత ఉపన్యాసంలో మాట్లాడుతూ....ఈ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ద్వారా ప్రజలకు మంచి సేవలు అందుతాయని తెలియజేశారు. కర్నూలు పట్టణంలో ఉన్న ట్రిపుల్ ఐటీ డి ఎమ్ వతో అవగాహన ఒప్పందం కుదిరిందని,వారి సహకారంతో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించి మెరుగైన వైద్య సేవలందించేలా కృషి చేస్తామని తెలిపారు.

ట్రిపుల్ ఐటీ రిజిస్ట్రార్ కె.గురుమూర్తి మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మరి ద్వారా తన తల్లి,తండ్రులు మరణించడం జరిగిందని తెలుపుతూ తన సోదరుడు కూడా అమెరికాలో క్యాన్సర్ వ్యాధిపై రీసెర్చ్ చేస్తూ ఉన్నారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి చేసిన పంట ఉత్పత్తులను సేవించడం ద్వారా ఆరోగ్యం ఉంటుందన్నారు. 70 శాతం మేరకు క్యాన్సర్ వ్యాధులను సరైన సమయంలో గుర్తిస్తే వాటిని నివారణ చేసే అవకాశం ఉంటుందన్నారు.

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కర్నూలు జిల్లాలోని క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ అన్ని హంగులతో, పూర్తి వైద్య సదుపాయాలతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్యాన్సర్ ను మొదటి దశలోనే నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రివెన్షన్ టు పాలియేటివ్ ఇన్ అంకాలజీ అనే అంశంపై అన్ని విభాగాల వైద్య సిబ్బందితో సమన్వయం



చేసుకుంటూ క్యాన్సర్ బాధితులకు ఔట్ పేషెంట్ బయాప్సీ కూడా చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా కృతిమ మేధస్సు ఏఐ టూల్స్ ద్వారా క్యాన్సర్ ను పూర్తి స్థాయిలో గుర్తించి వాటిని నివారణకు సహకరించాలని ట్రిపుల్ ఐటీ రిజిస్ట్రార్ ను ఆసుపత్రి సూపరింటెండెంట్ కోరారు.

వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి డా.చిట్టి నర్సమ్మ మాట్లాడుతూ క్యాన్సర్ పై సెమినార్ నిర్వహించడం చాలా మంచి విషయమని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజం కొరకు వైద్య పరీక్షలు ఎల్లప్పుడూ మంచి చేస్తాయని తెలిపారు. కలుషిత ఆహారం, నీరు, గాలి వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయని, వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉందని తెలి %శ్రీ%పారు.

కెనడా నుండి వచ్చిన టూవరల్డ్ క్యాన్సర్ కోఆర్డినేషన్ డైరెక్టర్ , డాక్టర్ సైమన్ సట్క్లిఫ్ మాట్లాడుతూ క్యాన్సర్ ను మొదటి దశలోనే గుర్తించి నివారించుకోవడం ఉత్తమమని, టూవరల్డ్ క్యాన్సర్ కొలాబరేషన్ ప్రతినిధులు ఇక్కడి విద్యార్థులకు క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తారని తెలియజేశారు.

అంతకుముందు కార్యక్రమానికి హాజరైన అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కార్యక్రమంలో కెనడా దేశ టూవరల్డ్ క్యాన్సర్ కొలాబరేషన్ ప్రతినిధులు డా.గిల్లియన్ ఫైల్స్, డా.మేరియాన్ మోర్గాన్డా లు మరియు డాక్టర్ గాయత్రి పలాట్ , వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కు అవగాహన సదస్సు



**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 30 . పల్లె వెలుగు** నంద్యాల పట్టణంలోని శాంతిరామ్ జనరల్ హాస్పిటల్ మరియు కళాశాల బృందం వారు ఎస్పిజి ఒకేషనల్ జూనియర్ కాలేజీ నందు స్టూడెంట్స్ కు ప్రముఖ మానసిక వైద్యురాలు డాక్టర్ ఓంకారం సింధుజ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ప్రొక్రాస్టినేషన్ అంటే పనులను ఆలస్యం చేయడం. ఇది విద్యార్థుల అకాడమిక్ ప్రదర్శనపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రొక్రాస్టినేషన్ వల్ల టెస్ట్‌లు, పరీక్షలు, ప్రాజెక్టులు ఆలస్యం అవుతూ, చివరికి డెడ్‌లైన్‌కి సమయం లేకుండా పోతుంది. ఇది ఒత్తిడిని పెంచి, మంచి ఫలితాలను సాధించడంలో అడ్డంకి అవుతుంది. పద్ధతిగా గమనిస్తే, ప్రొక్రాస్టినేషన్ ఒక గందరగోళం లాంటిది, ఒక పని పూర్తి చేస్తే మరో పనికి వెళ్ళేందుకు మనం ఆలస్యం చేస్తాం. ఈ సమస్యను ఎదుర్కొనడానికి, సమయాన్ని సరిగ్గా నిర్వహించడం చాలా ముఖ్యం. రోజువారీ కార్యాలయాల జాబితా తయారుచేసుకోవడం, ప్రాధాన్యతను బట్టి పనులను చేస్తూ, చిన్న విరామాలు తీసుకోవడం చాలా ఉపయోగకరం. మీరు స్వీయప్రేరణ పెంచుకునే ప్రయత్నం చేయండి. అలాగే, చిన్న గెలుపుల ద్వారా మనసు ఉత్సాహంగా ఉంచుకోండి.ఈ కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్యురాలు డాక్టర్ ఓంకారం సింధుజ కవిత ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ దివాకర్ , వైస్ ప్రిన్సిపల్ శేఖర్ నల్లని ప్రియాంక మేరీ మరియు శాంతిరరామ్ మెడికల్ హాస్పిటల్ కాలేజ్ బృందం పిఆర్ఓ లు వై.వి రమణ , డి.కిషోర్ బాబు లు పాల్గొన్నారు.



## లేట్ బర్త్ సర్టిఫికెట్లకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి

### ఎస్ ఎఫ్ ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ఆర్ నాయక్




**వెలుగోడు నవంబర్ 30పల్లె వెలుగు** పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆఫర్ ఐడి క్రియేట్ చేయడం కోసం స్కూల్ రికార్డ్స్, ఆధార్ అన్నింటిలోనూ ఒకే విధంగా ఉండాలని చెప్పడంతో ఆధారులో విద్యార్థులు మార్పులు చేర్పులు చేసుకోవాలంటే బర్త్ సర్టిఫికెట్ పొందాలి. ఇప్పుడు ఆ బర్త్ సర్టిఫికెట్ పొందడం చాలా కాస్టీగా అయిందని, ఇబ్బందిగా గందరగోళంగా ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్. నాయక్ స్థానిక సిఐటియూ కార్యాలయంలో ఎస్ ఎఫ్ ఐ మండల కమిటీ సమావేశంలో తెలిపారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని లేట్ బర్త్ సర్టిఫికెట్లను సచివాలయాల ద్వారా ఎంక్వైరీ చేయించి అందించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు చదువుకోకపోవడం కొంతమంది చదువుకొని గతంలో పంచాయితీ కార్యదర్శులు, అంగన్వాడి కేంద్రాల వద్ద బర్త్ రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ అవి ఆన్లైన్ కాలేదు. చాలా సచివాలయాల దగ్గర ఆ రిజిస్ట్రేషన్ చేసిన రికార్డులు అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు బర్త్ సర్టిఫికెట్లు అడగగానే మీవి ఆన్లైన్లో లేవు నాన్అవైలబిలిటీ సర్టిఫికెట్ తీసుకొని బర్త్ సర్టిఫికెట్ కావాలంటే ఆర్డిఒ ప్రొసీడింగ్స్ తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పుడు ఆర్డిఒ ప్రొసీడింగ్స్ తెచ్చుకోవడానికి విద్యార్థి సచివాలయంలో దరఖాస్తు చేసుకోవడానికి 110 నోటరీ అఫిడవిట్ చేయించడానికి, 180 బర్త్ అండ్ డెత్ రిజిస్ట్రేషన్ శాఖకు,నాన్ అవైలబిలిటీ కోసం 50 కట్టాల్సి వస్తుంది. స్కూల్ రికార్డ్స్ జిరాక్స్ అంగన్వాడీ కేంద్రాల్లో బర్త్ కన్ఫర్మేషన్ తీసుకొస్తేనే విఆర్ ఒలు రిపోర్ట్ రాస్తామని చెబుతున్నారు. విఆర్వొలు, ఆరి, తహశీల్దార్ రిపోర్టు రాసి తయారుచేసి కవరింగ్ లెటర్ తో ఆర్డిఓ ఆఫీస్ కు పంపాల్సి ఉంది. అసలే చదువుకోకుండా ఉండడం, పనుల కాలం కావడం పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సర్టిఫికెట్లు పొందడానికి ఇన్ని ఆఫీసుల చుట్టూ తిరగడం ఇబ్బందికరంగా మారి మధ్యవర్తులను ఆశ్రయించడంతో వేలకు వేలు డిమాండ్ చేస్తున్నారన్నారు. తాసిల్దార్ కార్యాలయంతో మొదలుకొని ఆర్డిఒ కార్యాలయం వరకు లేట్ బర్త్ సర్టిఫికెట్ కావాలంటే మామూలు ఇచ్చిన వారికి లేదా అధికారులతో సంబంధాలు ఉన్నవారికి మాత్రమే ఆర్డిఒ ప్రొసీడింగ్స్ వచ్చే పరిస్థితి ఉంది. సాధారణమైన ప్రజలు లేట్ బర్త్ సర్టిఫికెట్ పొందాలంటే చుక్కలు కనపడుతున్నాయి. అందుకే ప్రభుత్వం వెంటనే లేటుబర్త్ సర్టిఫికెట్ల విషయంలో చొరవచేసి విద్యార్థుల తల్లిదండ్రులు ఆఫీసుల చుట్టూ తిరగకుండా మధ్యవర్తులను ఆశ్రయించి వేలకు వేలు ఖర్చు పెట్టకుండా ప్రభుత్వమే బర్త్ సర్టిఫికెట్లను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఎక్కడికి అక్కడ ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ ఎఫ్ ఐ వెలుగోడు మండల అధ్యక్షులు శివకుమార్ కార్యదర్శి సైఫులా నాయుకులు వరుణ్, సాయి మరియు తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్, దేవాదాయ భూములను ఆక్రమణలకు గురి కాకుండా రక్షించాలి



## వక్ఫ్, దేవాదాయ భూములపై సర్వే చేసి ప్రస్తుత పరిస్థితిపై నివేదికలు ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు నంది పత్రిక**.......వక్ఫ్, దేవాదాయ భూములు ఆక్రమణలకు గురి కాకుండా రక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు...

శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు..

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసి తొలి సమావేశాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు.. మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ టీములు ఏర్పాటు చేసి, అన్ని వక్ఫ్ , దేవాదాయ భూములను తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు..వక్ఫ్, దేవాదాయ భూములను సర్వే నంబర్ వారీగా తనిఖీ చేసి, ఆక్రమణలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఏంటి అని రికార్డ్ చేసి నివేదికను 10 రోజుల్లోపు తనకు సమర్పించాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లను ఆదేశించారు... 15 రోజులకు ఒకసారి జిల్లా కమిటీ సమావేశం అయి, ఆక్రమణ లపై తీసుకున్న చర్యలపై సమీక్షిస్తామని కలెక్టర్ తెలిపారు..

పట్టణ ప్రాంతాల్లో వక్ఫ్, దేవాదాయ భూములపై దృష్టి సారించాలని కలెక్టర్ మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు..పట్టణ ప్రాంతాల్లో భూమి విలువ ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఆక్రమణలకు గురికాకుండా చూడాలని కలెక్టర్ మునిసిపల్ కమిషనర్ లను ఆదేశించారు..రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చిందని కలెక్టర్ తెలిపారు..

వక్ఫ్, దేవాదాయ భూములకి సంబంధించిన సర్వే నంబర్ ల పూర్తి వివరాలను మండల,డివిజన్ వారీగా తయారుచేసి సబ్ కలెక్టర్, ఆర్డీఓ లకు అందచేయాలని కలెక్టర్ డిఆర్వో ను ఆదేశించారు..

వక్ఫ్, దేవాదాయ భూముల ఆక్రమణలకు సంబంధించి పోలీస్ శాఖ వెంటనే స్పందించాలని కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు..ఇందుకు సంబంధించి కేసులు ఏమైనా నమోదు అయ్యాయా? అని వెరిఫై చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు..వక్ఫ్, దేవాదాయ భూముల ఆక్రమణలకు సంబంధించి కలెక్టరేట్, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, మైనార్టీ వెల్ఫేర్,పోలీస్, ఎండోమెంట్ శాఖల వద్ద ఉన్న గ్రీవెన్స్ లు అన్నీ ఒక చోటకు చేర్చి వాటి మీద చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు..

వక్ఫ్, దేవాదాయ భూముల సర్వే కోసం ఒక యాప్ ను




రూపొందించాలని కలెక్టర్ డి ఆర్వో ను ఆదేశించారు..సర్వే నంబర్లు, తనిఖీ వివరాలు, ఆక్రమణల వివరాలు, ప్రస్తుత పరిస్థితి, ఫోటోగ్రాఫ్ ల అప్లోడ్ వంటి వివరాలతో యాప్ ను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు..

రిజిస్ట్రేషన్ చేసే సమయంలో నియమ నిబంధనలు పాటించకుండా పొరపాట్లు చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను హెచ్చరించారు..భవన నిర్మాణాలకు అనుమతుల విషయంలోనూ నియమ నిబంధనలను పాటించాలని కలెక్టర్ మునిసిపల్ కమిషనర్ లను ఆదేశించారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, ఆన్లైన్ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్,ఆర్డీవోలు,మునిసిపల్ కమిషనర్ లు పాల్గొన్నారు..

# హెల్ప్ లైన్ నంబర్ 90008 22909, 0877 2256766. ను సద్వినియోగం చేసుకోండి.







## కమిషనర్ ఎన్.మౌర్య

పెంగల్ తుఫాను వలన కురిసే వర్షాలకు మీకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా హెల్ప్ లైన్ నంబర్ 90008 22909, 0877 2256766 లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలను కోరారు. తుఫాను బాధితుల సహాయం కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్ ను శనివారం సాయంత్రం కమిషనర్ పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని కాల్స్ వచ్చాయి, ఎంతమంది పనిచేస్తున్నారు? ఫిర్యాదులు ఏ విధంగా నమోదు చేస్తున్నారు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుఫాన్ వలన కురిసే వర్షాలతో ఎటువంటి ఇబ్బందులున్నా హెల్ప్ లైన్ 90008 22909, 0877 2256766 కు కాల్ చేసి తెలపాలని అన్నారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో తమ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని అన్నారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తే తుఫాన్ ఇబ్బందుల నుండి బయట పడవచ్చునని అన్నారు. ప్రజలు హెల్ప్ లైన్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని అన్నారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మేనేజర్ హాసీం, తదితరులు ఉన్నారు.

అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి.

తుఫాను నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం నగర పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి వర్షపునీరు సజావుగా వెళ్లేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఆయా ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ జాగ్రత్తగా ఉండాలని అన్నారు. మురుగునీటి కాలువల వద్ద నీరు ఆగకుండా, జెసిబిలు అందుబాటులో ఉంచుకుని వచ్చిన చెత్త, మురుగును ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వర్షాలకు ఎవరైనా ఇబ్బంది పడితే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ.రాజు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.

## ఎస్ డి పి ఐ పార్టీ నూతన ప్రెసిడెంట్ ఆరిఫ్ హుస్సేన్ ఎన్నిక :




**వెలుగోడు నవంబర్ 30 పల్లె వెలుగు** శ్రీశైలం నియోజకవర్గం ఎస్ డి పి ఐ పార్టీ నూతన ప్రెసిడెంట్ గా ఆరిఫ్ హుస్సేన్ ను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు హాఫిజ్ అత్తావుల్లా ఖాన్ అన్నారు. శనివారం వెలుగోడు స్థానిక ఎస్ డి పి ఐ కార్యాలయం నందు

ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎస్ డి పి ఐ పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటి సభ్యుడు అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలో ఎస్ డి పి ఐ పార్టీ శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ కమిటీ ఎన్నికలు నిర్వహించడం జరిగింది. జనరల్ సెక్రటరీ గా గౌస్, వైస్ ప్రెసిడెంట్ ఖాజా హుస్సేన్, సెక్రటరీ తౌసీఫ్ ట్రెజరర్ మొయిన్ ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా అబ్దుల్లా, మునీర్, హుస్సేన్, మాసూమ్, హాఫిజ్ షఫీ, సద్దాం లను బ్యాలెట్ పద్ధతిలో ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ బ్రాంచ్ నాయకులు పాల్గొనడం జరిగింది.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నిరుపేదలకు కొండంత అండ

## ఎమ్మెల్యే గిత్తజయ సూర్య

**= కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడంలో ముందడుగు**

**= తొలిరోజే 95 శాతం పింఛన్లు పంపిణీ అధికారుల కృషి చేయడం వల్ల జరిగింది**

**జూపాడుబంగ్లా నవంబర్ 30 పల్లె వెలుగు** ఎన్టీఆర్ భరోసా పథకం నిరుపేద ప్రజలకు కొండంత అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్లను అందిస్తారు. డిసెంబర్ ఒకటవ తేదీ ఆదివారం కావడంతో శనివారం30వ తేదీన పంపిణీ చేయడం జరిగింది.స్వయంగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసి కుటుంబ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో నిరాధారణకు గురిఅయిన నిరుపేదలకు భరోసా అభినందనీయం అన్నారు.ప్రతినెల వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రతినెల ప్రభుత్వం పింఛన్ అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ, టిడిపి నాయకులుగిరీశ్వర్ , తర్తూరు రమణారెడ్డి, రవికుమార్ యాదవ్, జంగాల పెద్దన్న, సుధాకర్, రాముడు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# వరల్డ్ ఎయిడ్స్ డే అవగాహన ర్యాలీ



**పాములపాడు నవంబర్ 30 పల్లె వెలుగు** మండల కేంద్రమైన పాములపాడులో మేరీబా-టీఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్ డే అవగాహన ర్యాలీని జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం- బి.గోపాల్ జండా ఊపి ప్రారంభించారు. ఈ వరల్డ్ ఎయిడ్స్ డే అవగాహన ర్యాలీ జిల్లా పరిషత్ హైస్కూల్ నుండి విద్యార్థులు, ఉపాధ్యాయులు, పిహెచ్సి వైద్యాధికారిణి ఇవి.నాగలక్ష్మి దేవి, ఆయుర్వేద విద్యాధికారిణి డి. సావిత్రి, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి. అంకన్న, జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు నల్లమల. అబ్రహం, పోలీస్ కానిస్టేబుల్ ఏ.ఖాజా, హెూంగార్డు టీ.మన్సూర్ అలి, మేరీబా-టీఐ స్వచ్ఛత సంస్థ ఓఆర్డబ్ల్యూ లు-ఎం.రాజు, అరుణ కుమారి, పీఈలు టి.అరుణ, కీర్తి, సేవా భారతి యూత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.షర్ఫుద్దీన్ అలి, గ్రంథాలయ అధికారి సి.వి.కృష్ణారెడ్డి, తదితరులతో కలిసి ఎయిడ్స్ వ్యాధికి మందు లేదు-నివారణ ఒక్కటే మార్గం, ఎయిడ్స్ అంటువ్యాధి కాదు-అంటించుకునే వ్యాధి, ఎయిడ్స్ రోగులను-ఆప్యాయతతో ఆదరిద్దాం అనే నినాదాలతో నగర వీధుల గుండా వెళ్లి, బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించడం జరిగింది. ఈ మానవాహారంలో డాక్టర్లు ఇవి. నాగలక్ష్మి దేవి, డి.సావిత్రి, లు మండల ప్రజలందరి ఎయిడ్స్ కి మందు లేదు నివారణ ఒక్కటే మార్గం,

రానున్న రోజుల్లో యువతరం చెడు అలవాట్లకు బానిస కాకుండా, మనమందరం కాపాడటం మన వంతు బాధ్యతగా స్వీకరించాలన్నారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి మనమందరం కలిసికట్టుగా ఒక అడుగు ముందుకు వేసి అక్రమ సంబంధాలకు, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా కాపాడేందుకు ముందుకు రావాలన్నారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవి/ఎయిడ్స్ గురించి తెలుసుకొని జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం హెల్త్ సూపర్వైజర్-ఎం.మద్దయ్య అందరితో ఎయిడ్స్ వ్యాధికి దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాంప్రసాద్, శ్రీనివాసులు, ద్రాక్షాయిని బాయి, రవీంద్ర నాయుడు, భవిత పాఠశాల ఉపాధ్యాయులు శంషుద్దీన్, రామ్మూర్తి, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల కాంపౌండర్ డి. మహబూబ్ బాషా, ప్రాథమిక వైద్యశాల సిహెచ్ఓ జి.అన్నమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ పి.నాగేశ్వరరావు, ఆశ వర్కర్లు విజయ కుమారి, వెంగమ్మ, విద్యార్థిని,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**దేవాలయాల పాలకమండలిలో విశ్వబ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించాలి. రామాచారి విశ్వకర్మ**

**ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు వినతి పత్రం అందజేసిన విశ్వబ్రాహ్మణులు**



**ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 30 పల్లె వెలుగు** పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ కలిసి వినతి పత్రం అందజేసిన ఆళ్లగడ్డ విశ్వబ్రాహ్మణ సాధికార సమితినియోజకవర్గ కన్వీనర్ రామాచారి ఈ సందర్భంగా రామాచారి విశ్వకర్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని అదేవిధంగా దేవాలయాల పాలకమండలిలో బ్రాహ్మణులకు మరియు నాయి బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించినట్లుగా విశ్వబ్రాహ్మణులకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని దేవాలయాల నిర్మాణం తో పాటు శిలా శిల్పము ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్య భూమిక పోషిస్తున్న విశ్వబ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం చాలా విచారకరమని రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 లక్షలు జనాభా ఉన్న విశ్వబ్రాహ్మణులు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలో అత్యంత క్రియాశీలకంగా పని చేస్తూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నారు కానీ విశ్వబ్రాహ్మణులకు ఎటువంటి గుర్తింపు కానీ పార్టీలో పదవులు కానీ ఇవ్వకపోవడం విశ్వబ్రాహ్మణులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది అని అన్నారు మీరు మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించి విశ్వబ్రాహ్మణులకు పార్టీ పదవులలో సముచిత స్థానం కల్పించాలని కోరరు ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ తప్పకుండా మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

# దేవాలయ నిర్మాణం కోసం 50 లక్షలు సి జి ఎఫ్ నిధులు మంజూరు.



**ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 30 పల్లె వెలుగు** రుద్రవరం మండలం బీరవోలు గ్రామం లో శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం నిర్మాణముకు రూ 50 లక్షలు సిజిఎఫ్ నిధులు మంజూరైనట్లు టిడిపి నాయకుడు పుల్లగూర లక్ష్మీకాంత్ యాదవ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో నిధులు మంజూరు అయినా భూమి పూజ తోనే దేవాలయ నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. తిరిగి ఆలయ నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తులు ఎంఎల్ఏ భూమా అఖిల ప్రియ దృష్టికి తీసుకు వెళ్లారన్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే దేవాదాయ శాఖ మంత్రి తో మాట్లాడి వెంటనే దేవాలయ అధికారులను పనులు ప్రారంభించి త్వరగా దేవాలయ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారన్నారు. ఆగిన దేవాలయ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కోరిన వెంటనే స్పందించి నిర్మాణ పనులకు ఆదేశించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్ రామ్ , భూమా విఖ్యాత్ రెడ్డి, కి బిరవోలు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు

# డోన్ లో ఘనంగా మాదిగల కార్తీక వనబోజన కార్యక్రమం





**పల్లె వెలుగు నవంబర్ :30** మాదిగల కార్తిక వన భోజనం కార్యక్రమం డోన్ పట్టణము ఉడుములపాడు గ్రామ సమీపములో ఉన్న శ్రీ దత్తత్రేయ స్వామి గుడిలో అంగరంగ వైభావంగా జరిగింది. దాదాపుగా డోన్ మండలములో 1500, మంది మాదిగలు సంతోషంగా కలసి వనభోజనాల కార్యక్రమములో పాల్గొనడం జరిగింది. మాదిగల అందరూ ఐకమత్యంతో ఉండాలని, ప్రతి ఒక్కరూ తమ యొక్క పిల్లలను మంచి చదువులు చదివించి ఉన్నత స్థానంలో ఉంచాలని మాట్లాడడం జరిగింది.ముందుగా పట్టణములో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీతో కొత్త బస్టాండ్ వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యకరములో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గుండాల ఈశ్వరయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రగుడి కృష్ణ మాదిగ వైసీపీ నాయకులు ఏం శ్రీరాములు ,తెలుగుదేశం పార్టీ ఎస్సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు మాదిగ, వ్యాపారవేత్త వలసల బాలుడు,ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఉంగరాని గుంట్ల మాజీ సర్పంచ్ రాముడు మాదిగ,ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు భూమా నాగన్న మాదిగ, కాంగ్రెస్ పార్టీ డోన్ నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటి స్వామి మాదిగ,

ఆవుల దొడ్డి సర్పంచ్ మద్దిలేటి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి కేశవయ్య మాదిగ, ఎర్రగుంట్ల సర్పంచ్ పెద్ద గిడ్డయ్య మాదిగ,చింతల పేట సర్పంచ్ సూరి,బిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తకోట విజయభాస్కర్ మాదిగ ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు శివన్న మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు ఎద్దు పెంట పెద్దయ్య మాదిగ , ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గౌండ రామాంజనేయులు మాదిగ , ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు సొప్పాకుల చిన్న రాయుడు మాదిగ, న్యాయ వాదులు రవి ప్రకాష్,గుండాల శ్యాం సుందర్ బాలమద్దయ్య, జీవన్, మనోహర్, శ్రీ ప్రతిభ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎం జయరాముడు,ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు తూర్పునాట్ జయరాం ,బండి పుల్లన్న, చంద్ర శేఖర్, ఆర్ సి మద్దిలేటీ, గుండాల కిరణ్ కుమార్,జైపాల్, జి నాగరాజు,ఎస్సి, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబెర్ రమేష్ మరియు కటార్ కొండ మాధవ్ కృష్ణ మాదిగ, చిన్న కాంత్, పాతపేటరాజ,కన్నప్పకుంట రాముడు, ఆర్. నాగేశ్వరావు, కొచ్చెరువు పెద్ద రామచంద్రుడు, చిన్న రామచంద్ర,రామదాసు, పి. సాలప్ప,శ్రీ రాములు,ఊటకొండ మనోహర్ రాజు,తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ పొందిన గడివేముల ఎంఈఓ కు ఘన సన్మానం

**పల్లె వెలుగు న్యూస్ గడివేముల :** మండల విద్యాధికారిని విమల వసుంధర దేవి పదవి విరమణ సందర్భంగా గడివేముల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండలంలోని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ డిఇఓ మహబూబ్ బేగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖలో పనిచేయడం పూర్వజన్మ సుకృతం అని అందునా 42 సంవత్సరములు విద్యాశాఖలోని అంచలంచెలుగా ఎదుగుతూ చేరడం అనేది చాలా గొప్ప విషయమని వారు తెలిపారు. ఎంఈఓ మేరీ సునీత మాట్లాడుతూ విమల వసుంధర దేవి 42 సంవత్సరాల ఉద్యోగ ప్రస్థానంలో, మొట్టమొదటిగా నంద్యాల జిల్లా పులిమద్ది గ్రామంలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా విధులను చేపట్టారు, తర్వాత జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తూ, గడివేముల మండలంలో పెసర వాయి గ్రామానికి స్కూల్ అసిస్టెంట్ గా పదోన్నతి పై వచ్చారు, తర్వాత కొరటమద్ది ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేశారు ట్రాన్స్ఫర్ లో భాగంగా మళ్లీ పెసరవెయ్య ప్రాథమిక ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు, ఆపై గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పదోన్నతిపై హెడ్మాస్టర్ గా పనిచేసి తరువాత మళ్లీ పదోన్నతిపై గడివేముల మండల విద్యాధికారిగా చేరారు. 42 సంవత్సరాల ఉద్యోగ ప్రస్థానంలో ఉపాధ్యాయుల మన్ననలను పొందాలని గుర్తు చేశారు. మండలంలోని ఉపాధ్యాయులు ఆమె చేసిన సేవలను కొనియాడారు.

ఈ సందర్భంగా పదవి విరమణ పొందుతున్న ఎంఈఓ విమల వసుంధర దేవి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి జీవితంలో పదవి విరమణ అనేది చివరి అంకం అని, విద్యార్థులకు విద్యార్థులను నేర్పేది ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు.

ఈ సందర్భంగా వచ్చిన మండల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు రవూఫ్, మహేశ్వరరెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు నగిరి శ్రీనివాసులు, రవి, పి ఆర్ టి యు నాయకులు జేసీ నరసింహులు, వెంకటేశ్వర్లు ఏపీటీఎఫ్ నాయకులు పుల్లయ్య, రాజేష్, 1978 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు ఆమేకు పుష్ప గుచ్చాలు అందజేసి, దుస్సాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్టరీ ఇమ్మానియేల్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పి ఆర్ టి యు నూతన కార్యవర్గం ఎన్నిక...



**ఆత్మకూరు నవంబర్ 30 పల్లె వెలుగు** ఆత్మకూరు మండల పి ఆర్ టి యు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పి ఆర్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం తెలిపారు. మండల అధ్యక్షుడిగా సి ప్రదీప్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా హనుమంతు, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్ మన్సూర్, ఉపాధ్యక్షుడిగా రమణయ్య, మహిళా ఉపాధ్యక్షురాలుగా ఎన్ శోభ, కార్యదర్శులుగా ఎస్ ఆర్ రెహమాన్, ఆర్ మల్లీశ్వరి, మహిళా కార్యదర్శిగా సురేఖ లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి నూర్ అహమ్మద్ తెలిపారు. జిల్లా కౌన్సిలర్లుగా నూర్ అహ్మద్, కే హుస్సేన్ సాహెబ్, ఎం చంద్రశేఖర్, ఎస్ కాజామొద్దీన్, కే రాజేశ్వర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుఎన్నికల అధికారి తెలిపారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు



# శ్రీ కామేశ్వరి అమ్మవారికి 41 గ్రాముల స్వర్ణ కంఠాభరణము బహుకరణ

**మహానంది నవంబర్ 30 (నంది పత్రిక):- పల్లె వెలుగు** మహానంది దేవస్థానం వేదపండితులు నాగేశ్వరశర్మ, శ్యామల దంపతులు,శాంతారాం భట్ తారాభట్ దంపతులు శ్రీశైలం దేవస్థానం వేదపండితులు చెందూరి జ్యోతి స్వరూప్,భావనా కృష్ణ చైతన్య దంపతులు శ్రీ కామేశ్వరీ అమ్మవారికి

41 గ్రాముల స్వర్ణ కంఠా భరణ మును ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి గారి ద్వారా భక్తితో సమర్పించినారు. దాతలను ఈవో అభినందించారు.



## నంద్యాల సబ్ జైలును తనిఖీ చేసిన జడ్జి

**నంద్యాల లీగల్ . నవంబర్ 30 . (నంది పత్రిక ):** నంద్యాల సబ్ జైల్ ను శనివారం కర్నూలు డిస్టిక్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి నీలా వెంకట శేషాద్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి జైలు పరిసరాలను తనిఖీ చేశారు జైలు లో ఖైదీ ల గదులు వంట గది బాత్రూంలను పరిశీలించారు. అనంతరం ఖైదీల హాజరు పట్టీలను పరిశీలించి వారి ఆరోగ్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని వారి కుటుంబాల గురించి ఆలోచించాలని తెలిపారు ఏదైనా సమస్యలు ఉంటే కేసుల గురించి వాదించడానికి ప్రత్యేకంగా న్యాయవాది ఉంటారని ఉచితంగా వాదించడానికిప్రభుత్వం జైల్లో ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపర్డెంట్ గురు ప్రసాద్ కోర్టు సిబ్బంది రామచంద్రారెడ్డి జైలు సిబ్బంది పాల్గొన్నారు.






# బయలు వీరభద్ర స్వామి విశేషపూజ

శ్రీశైలం నవంబర్ 30 పల్లె వెలుగు అమావాస్యను పురస్కరించుకుని లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను నిర్వహిస్తున్నది.

ప్రతీ మంగళవారం, అమావాస్యరోజులలో ఈ విశేషార్చనను జరిపించడం జరుగుతోంది.

కాగా అమావాస్య రోజున భక్తులు కూడా పరోక్షసేవగా ఈ అర్చనను జరిపించుకునే అవకాశం కల్పించబడింది.

ఈ రోజు పరోక్షసేవ ద్వారా 27 మంది భక్తులు ఈ విశేషపూజలను జరిపించుకుంటున్నారు.

తెలుగు రాష్ట్రాల నుండేకాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రదేశాల నుండి కూడా భక్తులు ఈ పూజలను జరిపించుకుంటున్నారు..

కాగా ఈ పూజాదికాల కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను నిర్వహించబడుతుంది..

ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం జరిపించబడుతుంది.

ఈ స్వామి ఆరాధన వలన గ్రహదోషాలు నివారించబడుతాయని, అరిష్టాలన్నీ తొలగి పోతాయని, ఎంతటి క్లిష్ట సమస్యలైనా పరిష్కరించబడతాయని, ప్రమాదాలు నివారించబడతాయని, సర్వకార్యానుకూలత లభిస్తుందని, అభీష్టాలు సిద్ధిస్తాయని పండితులు పేర్కొంటున్నారు.

కాగా ఈ పరోక్షసేవ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు వీలుగా ప్రసార వివరాలు, ప్రసారాల సమయం మొదలైనవాటిని ఎప్పటికప్పుడు సేవాకర్తలకు తెలియజేయడం జరుగుతుంది.

## విద్యార్థులు సేవాభావంతో మెలగాలి...అసోషియేట్ డీన్

**విజయలక్ష్మి**



మహానంది నవంబరు30 పల్లె వెలుగు విద్యార్థులు సేవాభావంతో మెలగాలని వ్యవసాయ కళాశాల అసోషియేట్ డీన్ డా.విజయలక్ష్మి కోరారు.శనివారం మహానంది మండల పరిధిలోని అల్లినగరం గ్రామంలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావంతో పలు సేవా కార్యక్రమాలు చేయటం వల్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు.మొక్కలు నాటడం వల్ల పర్యావర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.డాక్టర్ విజయ భాస్కర్ మాట్లాడుతూ సేవాకార్యక్రమాలను శ్రద్ధతో పూర్తి చేయాలన్నారు.ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో చేసే పనులగురించి వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీ దేవమ్మ,ఉత్తమ సేవా రైతు మాభూ హుస్సేన్,ఉపసర్పంచ్ మహేష్,ఉపాధ్యాయురాలు అనూష,సుబ్బరామిరెడ్డి,వ్యవసాయ కళాశాల డాక్టర్ మాదవి,గీతా శిరీష,వినోద్,చంద్రశేఖర్,శ్యామ్,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## ద్రోణపూరి వీరాంజనేయ స్వామి ఊరేగింపు



పల్లె వెలుగు నవంబర్ :30 డోన్ పట్టణం పాతపేట, వంక వీధి, ప్రసిద్ధిగాంచిన శ్రీ ద్రోణపూరి వీరాంజనేయ స్వామి ఊరేగింపు ఉత్సవం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంకలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆంజనేయ స్వామి మాల ధారణ స్వాములు శనివారం అమాస్య రోజుని పురస్కరించుకొని స్వామివారిని ఊరేగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూజారి సురేష్ స్వామి, వడ్డే వీరాంజి, ఆంజనేయులు, ఎర్రి స్వామి, అజయ్, రాకేష్, భక్త బృందం పాల్గొనడం జరిగింది.

# తాగు నీటికోసం పాట్లు




**-వాటర్ ప్యాంట్లు ఉన్న నీరు అందని వైనం**
**-నీటిఇబ్బందుల ఎదుర్కొంటున్న గువ్వలకుంట్ల గ్రామస్తులు**
**-2 కీలోమిటర్లు వెళ్లి నీరు తెచుకుంటున్న వైనం -గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదంటున్న గ్రామస్తులు.**

కొత్తపల్లి: నవంబర్ 30 పల్లె వెలుగు వేసవి కాలం రాకముందే మండలంలో నీటి కష్టాలు మొదలైన వైనం నెలకొంది. మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో ప్రజలు తాగునీటికోసం పాట్లుపడుతున్నారు. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్నా సరే 2 కిలోమీటర్ల మేర వేరే గ్రామమైన జి.వీరాపురం వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో చేతిపంపులు ఉన్నా ఆ నీరు త్రాగేందుకు సరిగా లేకపోవడంతో గ్రామ ప్రజలు మినరల్ వాటర్ తాగేందుకు అలవాటు పడ్డారు. అయితే అదికాస్తా రెండురోజులకొకసారి మరమ్మత్తులకు గురౌతుండడంతో గ్రామ ప్రజలు తాగునీటికోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే ఉన్న గ్రామంలో కూడా రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నా అందులో ఒకటి మాత్రమే పనిచేస్తుండడంతో రెండు గ్రామాల ప్రజల నీటి అవసరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. గ్రామాల్లోని మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణ గ్రామ పంచాయతీ పరిధిలో ఉండడంతో మరమ్మత్తులు చేసి నీటిఅవసరాలు తీర్చాలని ఎన్ని మార్లు పంచాయతీ అధికారికి తెలిపినా కూడా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్థులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ అధికాలు చర్యలు తీసుకొని గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్ను మరమ్మత్తులు చేయించి తాగునీరు అందేలా చూడాలని కోరుతున్నారు.

## ఉద్యాన తోటల సాగుతో రైతుల అభివృద్ధి



కొత్తపల్లి : నవంబర్ 30 పల్లె వెలుగు ఉద్యాన తోటల సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఏపీడీ దాసు అన్నారు. ఆయన శనివారం ముసలిమడుగు గ్రామంలో ఉపాధిహామీ కింద సాగవుతున్నా మునగతోటలను పరిశీలించారు గ్రామంలో అత్యధికంగా మునగతోటలు సాగుచేయడం పై హర్షం వ్యక్తం చేశారు ఉపాధిహామిపథకం కింద ఉద్యాన తోటల సాగుకు అందించే ఆర్థికసాయం సద్వినియోగం చేసుకుని మునగ తోటలతో పాటు ఇతర పండ్లతోటలను కూడ సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. ఉపాధి పథకం కింద సాగు చేసిన మునగ తోటలకు పూర్తి స్థాయిలో బిల్లులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామి క్షేత్రసహాయకుడు దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## మహానంది పుణ్యక్షేత్రంలో భక్తజన సందడి



మహానంది నవంబర్ 30 పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో చివరి కార్తీక శనివారం,అమావాస్య సందర్భంగా భక్తజన సందడి నెలకొంది.వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు మహానంది క్షేత్రానికి తరలివచ్చారు.స్థానిక కోనేరుల పుణ్య స్నానాలు ఆచరించి,శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ముఖమండపం,నాగులకట్ట,ధ్వజస్తంభం వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు.తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెట్టకుండా దేవస్థానం అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాటు పర్యవేక్షించారు.మహానంది ఎస్ఐ ఎన్.రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


## మహానంది క్షేత్రంలో లోక కళ్యాణార్థం వైభవంగా లక్ష కుంకుమార్చన,శాంతి కళ్యాణోత్సవం

**మహా పూర్ణాహుతితో ముగిసిన కార్తీక మాసోత్సవాలు**

మహానంది నవంబర్ 30 పల్లె వెలుగు

మహానంది పుణ్యక్షేత్రంలో కార్తీక చివరి శనివారం అమావాస్య సందర్భంగా శ్రీ గంగా కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివార్లకు

లోక కళ్యాణార్థం వైభవంగా లక్ష కుంకుమార్చన,శాంతి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.ఆలయ ఈవో ఎన్.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు,అర్చకులు వేద మంత్రోచ్చారణలతో పూజా దాతలు డాక్టర్ రామకృష్ణారెడ్డి,విజయకుమారి దంపతలు,కోడలు ప్రగతి రెడ్డి వారి కుటుంబ సభ్యులు శ్రీ కామేశ్వరి అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.అనంతరం యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించారు.కలశ ఉద్వాసన చేసి,కలశ జలాలను శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివార్లకు సమర్పించారు.సాయంత్రం స్థానిక అభిషేక మండపంలో పండితులు,అర్చకులు శాంతి కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.ముందుగా గణపతి పూజ,పుణ్యాహవాచనం,అక్షింతలు సమర్పణ,జిలకర్ర బెల్లం,మాంగల్య ధారణ క్రతువులు వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ డిగ్రీ కాలేజీ విద్యార్థులు,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణాన్ని వీక్షించారు.



## రాజీమార్గమే రాజ మార్గమని కేసులు పరిష్కరించుకోవాలి

**సీనియర్ సివిల్ జడ్జి తంగమణి**



డోన్,పల్లె వెలుగు నవంబర్ :30 రాజీమార్గమే రాజమార్గమని ఏళ్ల తరబడి కేసులను లోక్ అదాలత్ లో రాజీద్వారాపరిష్కరించుకోవాలని డోన్ సీనియర్ సివిల్ జడ్జ్ తంగమణి,మరియు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ రాహుల్ అంబేద్కర్ అన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ డోన్ లో డిసెంబర్ 14న మెగా లోక్ అదాలత్ కోర్టులో నిర్వహించడం జరుగుతుందని న్యాయమూర్తులు తెలిపారు. ఇందులో ముఖ్యంగా సివిల్ తగాదాలు, మరియు భార్యాభర్త తగాదాలు, బ్యాంకు కేసులు, పోస్ట్ ఆఫీస్ సంబంధించిన కేసులు, టెలిఫోన్ కు సంబంధించిన కేసులు, మున్సిపల్ పరిధిలోని సమస్యల కేసులను లోక్ అదాలత్ లో పరిష్కరించడం జరుగు తుందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఈ సదా అవకాశాన్ని డోన్ పట్టణ ప్రజలే కాకుండా క్రిష్ణగిరి, రాచర్ల, ప్యాపిలి, వెల్దుర్తి, జలదుర్గం, పోలీస్ స్టేషన్లో ఉన్న అర్జీదారులు మరియు సివిల్ తగాదాల ఉన్న ప్రతి ఒక్కరు కూడా రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని న్యాయమూర్తులు సూచించారు. ఈ సందర్భంగా ప్రతి రెండు నెలలకు ఒకసారి మెగా లోక్ అదాలత్, జాతీయ లోక్ అదాలత్ స్టేట్ లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, అలాగే ఇక్కడ ఉన్న అన్ని కోర్టుల ద్వారా ప్రజలు తమ సమస్యలను రాజీ పరిష్కారం ద్వారా పరిష్కరించుకోవాలని ప్రజలకు జడ్జిలు సూచించారు. ప్రజలను చైతన్యపరిచి కక్ష ద్వారల ద్వారా ఉన్నటువంటి కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవాలని న్యాయమూర్తులు ప్రజలకు తెలియజేశారు. అదేవిధంగా ఎక్సైజ్ కేసులలో 10 లీటర్ల నాటు సారా దొరికిన కేసులను జరిమానా ద్వారా పరిష్కరిస్తామని తెలియజేశారు. నేడు జరిగిన సమావేశంలో పోలీసులకు, న్యాయవాదులకు కొన్ని సూచనలు తెలపడం జరిగిందని న్యాయమూర్తులు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని న్యాయమూర్తులు సూచించారు.



## అర్జిఎం గవర్నమెంట్ కళాశాలలో ర్యాగింగ్ సైబర్ క్రైమ్ పై అవగాహన



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 30 .పల్లె వెలుగు: నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల మహిళా పోలీస్ ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో అర్జిఎం కళాశాల మరియు నంద్యాల గవర్నమెంట్ డిగ్రీ కళాశాల నందు సైబర్ క్రైమ్ ర్యాగింగ్ మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ అవగాహన కార్యక్రమం నందు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం అంటే ఒక వ్యక్తిని అవమానించడం లేదా చికాకు బెదిరింపులు మొదలగునవి చేయడం.విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషేధించడం జరిగిందని ర్యాగింగ్ చేయడం వలన విద్యార్థి జీవితం నాశనం కావడం మాత్రమే కాకుండా మీపై మీ తల్లిదండ్రులు పెంచుకున్న నమ్మకం అడియాశాలుగానే మిగిలిపోతాయి.ఎవరైనా విద్యార్థి ర్యాగింగ్ కార్యకలాపాలకు పాల్పడితే విద్యాసంస్థల నుండి సస్పెండ్ చేయడంతో పాటు డిపార్ట్ చేయడం కూడా జరుగుతుందని తెలియజేశారు.మహిళా సాధికారత అనేది మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు మరియు స్వేచ్ఛలను కల్పించడం. ఇది మహిళల స్వయంప్రతిపత్తి, స్వాతంత్ర్యం మరియు సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడం. ముఖ్యంగా మహిళలకు విద్యను అందించడం,ఆర్థిక స్వాతంత్ర్యం మరియు ఆర్థిక అవకాశాలను కల్పించడం.రాజకీయలలో ప్రాతినిధ్యం ప్రాతినిధ్యాన్యత కల్పించడం.సామాజిక సమానత్వం సామాజిక సమానత్వాన్ని కల్పించడంమని తెలియజేశారు.సైబర్ క్రైమ్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణకు స్వీయ అప్రమత్తతే ముఖ్యమని తెలియజేశారు.ఎవరైనా సైబర్ క్రైమ్ నేరగాళ్ల మాయలో పడి మోసపోతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేసి సహాయం పొందవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వ్యక్తుల నుండి వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదని, ఆన్లైన్ లావాదేవీలు చేసే క్రమంలో టెక్నాలజీని వాడుతున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని అత్యాశకు వెళ్లి సైబర్ క్రైమ్ నేరగాళ్ల మాయలో పడవద్దని తెలియజేశారు



# సర్వాయి పల్లెలో మినీ గోకులం ప్రారంభించిన ఎమ్మెల్యే భూమా







## అఖిలప్రియ 30 రూపాయలు నుండి 4 వేలకు పెన్షన్లు పెంచిన ఘనత టిడిపి దే ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 30 పల్లె వెలుగు** దేశంలోనే పెన్షన్లను మంజూరు చేసి 30 రూపాయల నుండి నేడు 4 వేల రూపాయలు వరకు పెన్షన్ దారులకు అందించిన ఘనత నాడు సీఎం ఎన్టీఆర్ నుండి నేడు సీఎం చంద్రబాబు నాయుడు వరకు పేదలకు అందించిన ఘనత మన ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు శనివారం

ఉయ్యాలవాడ మండలం సర్వాయి పల్లె గ్రామంలో కొత్తగా నిర్మించిన మినీ గోకులంను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రారంభించి అనంతరం పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకటవ తేదీ కంటే ఒక్కరోజు ముందుగానే పింఛన్ పంపిణీ చేశామన్నారు ఫంక్షన్కు పొందే వారందరికీ ఒకటవ తేదీ కంటే ముందే 30వ తేదీనే పింఛన్ పంపిణీ చేసిన రాష్ట్రం ఏదైనా ఉందంటే అది మన రాష్ట్రమే మన టీడీపీ ప్రభుత్వమేఅన్నారు వైసిపి ప్రభుత్వం పింఛన్ వెయ్యి రూపాయలు పెంచుతా అని చెప్పి పెంచలేని పంచలేని ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైసీపీ ప్రభుత్వమేనని తెలిపారు సీఎంమాట ఇచ్చిన ప్రకారం గెలిచినప్పటి నుంచే 4వేలువ్వడం అందుకు ప్రజలందరి తరపున సీఎంకు కృతజ్ఞతలుతెలుపుతున్నానన్నారు. చేతగాని ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి పేరు తెచ్చుకున్నారు అలాగే చేతగాని ఎమ్మెల్యేలుగా గతంలో వైసిపి నాయకులు పేరు తెచ్చుకున్నారన్నారు.

ప్రజలందరూ గ్రామస్థాయిలో అభివృద్ధి పథకాలు చూడబోతున్నారని మిని గోకులం సర్వాయి పల్లె గ్రామంలో జిల్లాలోనే మొట్టమొదటి మినీ గోకులం ను ప్రారంభించామన్నారు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని ప్రజలందరికీ విన్నవించుకుంటున్నానన్నారుఅలాగే రైతులు ఎవరు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఉయ్యాల మండలానికి లిఫ్ట్ ఇరిగేషన్ కావాలని అడగడం జరిగిందని మూడు కోట్లు అవుతుందని సంబంధిత మంత్రితో కలెక్టర్ తో మాట్లాడి త్వరలోనే చేస్తామని హామీ ఇచ్చారన్నారు నిరుద్యోగ యువతకు కచ్చితంగా దారి చూపిస్తామనిపట్టణంలో జాబ్ మేళా ఏర్పాటు చేసి నిరుద్యోగులకు పలు కంపెనీలలో 65 మంది చేరారున్నారు నిరుద్యోగ యువతఉండకుండాచూసుకుంటామని తెలిపారు.టిడిపి నాయకులకుఅందరికీతెలియజేయడమేమనగా ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ పార్టీలకు అతీతంగా పనులు చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు టిడిపి నాయకులు కార్యకర్తలు భూమా అభిమానులు పాల్గొన్నారు.

# 'మహా' విజయం ఎలా సాధ్యమైంది?

ఈ నెల 15న ప్రచురితమైన నా కాలమ్ శీర్షిక 'వెలలేని మాగాణి మహారాష్ట్ర'. బీజేపీ, శివసేన, ఎన్‌సీపీలతో కూడిన మహాయుతి కూటమి నవంబర్ 20 ఎన్నికలలో ఆ 'మాగాణి'ని గెలుచుకున్నది. ఆ విజయం తిరుగులేనిది అనడానికి నేనేమీ సంకోచించను. మహారాష్ట్ర శాసనసభలోని 238 సీట్లకు గాను 230 స్థానాలను మహాయుతి స్వాయత్తం చేసుకున్నది.

మహాయుతి మహా విజయానికి ప్రధాన కారణమేమిటి? ఈ విషయమైపెద్ద చర్చ ప్రారంభమయింది. లడ్కీ బెహన యోజన (ఎల్‌బివై) కారణమని అత్యధికులు అంగీకరిస్తున్నారు. ప్రతి గృహిణికి (కుటుంబ వార్షిక ఆదాయం రెండున్నర లక్షల రూపాయల కంటే తక్కువగా ఉన్న పక్షంలో) నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని మహాయుతి వాగ్దానం చేసింది. ముఖ్యమంత్రి శిందే ప్రభుత్వం గత జూలై 1 నుంచి ఆ పథకాన్ని అమలుపరుస్తోంది. 2.5 కోట్ల మంది గృహిణులు ఎల్‌బివై లబ్ధిదారులుగా ఉన్నారు. తమను మళ్లీ ఎన్నుకున్న పక్షంలో ఆ ఆర్థిక సహాయాన్ని రూ.2100కు పెంచుతామని కూడా మహాయుతి హామీ ఇచ్చింది. లడ్కీ బెహన యోజన సంపూర్ణంగా విజయవంతమయింది. వ్యవసాయరంగంలో దురవస్థలు, పెచ్చరిల్లి పోతున్న నిరుద్యోగిత, గ్రామీణ మహిళలకు కొరవడిన ఉపాధి అవకాశాలు, గ్రామీణ వేతనాలు గొర్రె తోకలా ఉండిపోవడం, ద్రవ్యోల్బణం మొదలైన సమస్యలు ఆ ఆర్థిక సహాయ పథకం ప్రజలను విశేషంగా ఆకట్టుకునేలా చేశాయి. అయితే అదేమీ వినూత్న పథకమేమీ కాదు. అదొక అనుకరణ పథకం. మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో ఇప్పటికే అమలవుతున్న పథకాలను అనుసరించి ఎల్‌బివైను రూపొందించారు. సరే, మహాయుతి ప్రధాన ప్రత్యర్థి ఎమ్‌వీఏ సైతం తాము అధికారంలోకి వస్తే ప్రతి పేద మహిళకు నెలకు రూ.3000 చొప్పున ఆర్థిక సహాయమందిస్తామని హామీ ఇచ్చింది. పాలక, ప్రతిపక్ష కూటముల వాదనలను తుల్యంగా చూస్తే లడ్కీ బెహన యోజన ఎన్నికలలో మహాయుతి విజయానికి దోహదం చేసిన నిర్ణయాత్మకమైన కారణమని నేను భావించడం లేదు.

ఒక ప్రచ్ఛన్న సందేశం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేసిందని నేను భావిస్తున్నాను. బీజేపీ నాయకత్రయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లు ఆ సందేశాన్ని మహారాష్ట్ర ఓటర్లకు చేరవేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శ్రేణులు ఆ సందేశాన్ని మరింత విపులంగా ప్రజల మనసుల్లో నాటాయి. బీజేపీ నాయకత్రయం రెండు నినాదాలనిచ్చారు. ఒకటి%–% 'ఏక్ హై తో సేఫ్ హై' (మనం ఒకటిగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం)బీ రెండోది 'బాతేంగే తో కటేంగే' (విభజనలతో వినాశనమవుతాం). ఈ నినాదాలు తటస్థ స్వభావంతో ఉన్నట్టు అనిపిస్తుంది కదూ. అయితే అదొక వంచనాత్మక తటస్థత. నిజానికి ఒక నిర్దిష్ట సామాజిక సమూహాన్ని ఉద్దేశించే ఆ నినాదాలనిచ్చారు. 'లవ్ జిహాద్', 'ఓట్ జిహాద్'పై భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసంగాలు అడ్డు ఆపూ లేకుండా జరిగాయి. పాత నినాదాలు అయిన 'తుక్డే తుక్డే గ్యాంగ్', 'అర్బన్ నక్సల్స్'ను పునరుద్ధరించి విరివిగా ఉపయోగించుకున్నారు. ఈ సందేశాలను చాల చాకచక్యంగా వెలువరించారు. లక్ష్యంగా పెట్టుకున్న సామాజిక వర్గాలకు చేరేలా చేయడంలో సఫలమయ్యారు. ఇది గమనించిన తరువాత గత లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ నాయకుల ప్రచారం గుర్తుకువచ్చింది. 'మీకు రెండు గేదెలు ఉంటే ఒకదాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకెళుతుంది. మీ మంగళసూత్రాలను సైతం తీసుకువెళతారు. అలా తీసుకు వెళ్లిన వాటినన్నిటినీ అధిక సంతానం ఉన్న వారికి ఇచ్చి వేస్తారు' అని మోదీ ప్రభృతులు ప్రచారం చేయలేదూ?! బీజేపీ నాయకులు ఏ సామాజిక సమూహానికి ఆ సందేశాలను ఉద్దేశించారన్నది స్పష్టమే. ఆ లక్షిత సామాజిక సమూహానికి ఏ సామాజిక సమూహం నుంచి ప్రమాదం వాటిల్లనున్నదని నర్మగర్భితంగా చెప్పారన్నది కూడా తేటతెల్లంగా తెలుస్తూనే ఉన్నది. కాలమిస్ట్ ఆర్. జగన్నాథన్ (బీజేపీ సానుభూతిపరుడు) ఆ ప్రభావశీల నినాదాలను హిందూ ఓటర్లను సంఘటితం చేసేందుకు ఇచ్చారని అంగీకరించారు. ఈ ఏడాది విజయదశమి రోజున ఆరెస్సెస్ సర్ సంఘ్ ప్రచారక్ మోహన్ భాగవత్ వెలువరించిన ప్రసంగ సారాంశాన్ని ఆ కొత్త నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయి. మోహన్ భాగవత్ ఆ ప్రసంగంలో ఇలా అన్నారు: 'అసంఘటితంగా, బలహీనంగా ఉండిపోతే దుర్మార్గుల దురాగతాలను కొని తెచ్చుకోవడమే అవుతుందన్న సత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు అందరూ తెలుసుకోవాలి'. ఈ నినాదాలు, ప్రసంగాలు అన్నీ విద్వేషపూరిత ప్రచారంలోను, 'విభజించి గెలవడం' అనే ఎన్నికల వ్యూహంలో భాగమే. ప్రతి దేశంలోను మైనారిటీ వర్గాలు ఉంటాయి. అవి మతపరమైనవి లేదా భాషా పరమైనవి లేదా జాతి పరమైనవి కావచ్చు. అమెరికాకు నల్ల జాతి ప్రజలు, లాటినోలుబీ చైనాకు ఉయిఘుర్ ముస్లింలుబీ పాకిస్థాన్‌కు షియాలుబీ బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లకు హిందువులుబీ శ్రీలంకకు తమిళులు, ముస్లింలుబీ ఆస్ట్రేలియాకు మూలవాసులుబీ ఇజ్రాయెల్‌కు అరబ్‌లు, యూరోపియన్ దేశాలకు యూదులు, రోమాలు మైనారిటీ వర్గాలు. తమ మైనారిటీ వర్గాల భద్రతకు కౌన్సిల్ ఆఫ్ యూరోప్ 1998లో 'ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ నేషనల్ మైనారిటీస్'ను ఆమోదించింది తమ తమ సమాజాలలోని అన్ని వర్గాల మధ్య సమానత్వాన్ని




పెంపొందించేందుకు, జాతీయ మైనారిటీల సంస్కృతి, అస్తిత్వాన్ని పరిరక్షించేందుకు ఈ ఒడంబడికను ఉద్దేశించారు. రాజనీతిజ్ఞుడు, సామాజిక తాత్వికుడు అయిన డాక్టర్ అంబేద్కర్ ఎంతో దూరదృష్టితో మైనారిటీల హక్కులను భారత రాజ్యాంగంలో పౌరుల ప్రాథమిక హక్కులుగా పొందుపరిచారు.బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో హిందువుల హక్కుల పరిరక్షణ విషయమై భారత ప్రభుత్వమూ, భారతీయులూ తరచు భావోద్వేగాలకు లోనవుతుంటారు. పొరుగు దేశాలలోని హిందువుల హక్కుల గురించి ప్రభుత్వ నాయకులు గట్టిగా మాట్లాడుతుంటారు. విదేశీ విశ్వవిద్యాలయాలలో భారత సంతతికి చెందిన విద్యార్థులకు ఎదురవుతున్న వేధింపుల గురించి కూడా మనం ఆందోళన చెందుతుంటాం. విదేశాలలోని హిందూ ఆలయాలు, సిక్కు గురుద్వారాలపై దాడులు జరిగినప్పుడు మనం బిగ్గరగా మండిపడుతుంటాం. అయితే విదేశాలు, మానవ హక్కుల సంఘాలు మన దేశంలోని మైనారిటీ వర్గాలకు ఎదురవుతున్న వేధింపుల గురించి ప్రస్తావించినప్పుడు, ప్రశ్నించినప్పుడు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రంగంలోకి 'మా అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవద్దని' హెచ్చరిస్తుంది. ఇదొక నయవంచన ధోరణి, సందేహం లేదు. బంగ్లాదేశ్‌లో ఒక హిందూ సాధువును అరెస్ట్ చేశారుబీ ఇస్కాన్‌ను నిషేధించాలన్న డిమాండ్ పెరుగుతోంది. బంగ్లాదేశ్‌లో పరిణామాలకు ప్రతిస్పందనగా మన దేశంలోని ఒక మఠం అధిపతి 'ముస్లింలకు ఓటింగ్ హక్కులు నిరాకరించాలని' అన్నట్టు వార్తలు వచ్చాయి. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ రెండు సంకుచిత వైఖరులు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కావు. 'విభజించి గెలిచే' రాజకీయ క్రీడను ఎన్‌డీఏ కొనసాగిస్తున్న పక్షంలో మైనారిటీల సమస్య భారత్‌ను వెంటాడుతూనే ఉంటుంది. ఆ ఎన్నికల ఎత్తుగడ బ్రిటిష్ వలస పాలకుల కుటిల 'విభజించి పాలించు' వ్యూహానికి భిన్నమైనది కాదు.'విభజించి గెలిచే' రాజకీయ క్రీడను ఎన్‌డీఏ కొనసాగిస్తున్న పక్షంలో మైనారిటీల సమస్య భారత్‌ను వెంటాడుతూనే ఉంటుంది. ఆ ఎన్నికల ఎత్తుగడ బ్రిటిష్ వలస పాలకుల కుటిల 'విభజించి పాలించు' వ్యూహానికి భిన్న మైనది కాదు.

## సంచార జాతులా.. లేరే!

**చిత్తూరు,** సంచార జాతులకు స్థిర నివాసాలు కల్పించడం, వారి సంక్షేమానికి కృషి చేయడం కోసం కేంద్రప్రభుత్వం 'సంచార జాతుల ఆర్థిక సాధికారతా పథకం'(సీడ్)ను ప్రవేశపెట్టింది. రాష్ట్రప్రభుత్వంతో కలిసి ఈ పథకం అమలు మొదలైంది. ఇందుకోసం లబ్ధిదారులను గుర్తించడానికి జిల్లావ్యాప్తంగా సంచారజాతుల సర్వే జరుగుతోంది. పేరుకు సర్వేనే కానీ ఇది తూతూ మంత్రంగానే జరుగుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అనేక మండలాల నుంచి 'మా దగ్గర ఇటువంటి వారు లేరు' అనే సమాధానం వస్తోంది. నిజానికి ఊళ్లలో పట్టణాల్లో, ఉత్సవాల్లో సంచార జాతుల జనం కనిపిస్తూనే ఉన్నారు. మరి వీరంతా సర్వే పరిధిలోకి ఎందుకు రావడం లేదనే అనుమానం అధికారుల్లో కలుగుతోంది.

మురుగమ్మ, వెంకటేశులు దంపతులకు ఓ కొడుకున్నాడు. యాదమరిలోని చెన్నారెడ్డిపల్లి ధర్మరాజుల గుడిలో నివాసం. వంట, స్నానం, తినడం, పడుకోవడం.. అంతా ఆరుబయటే. పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో తిరుగుతుంటారు. వేడుకల్లో పక్క పిన్నులు, బెలూన్లు అమ్ముకుంటారు. మళ్లీ ఇక్కడికే వచ్చేస్తారు. వీళ్లని పిన్నుదాసర్లు అంటారు. వీరిది సంచార జీవనం. చెన్నారెడ్డిపల్లె చుట్టుపక్కల 50 నుంచి 60 కుటుంబాల సంచార జాతులవారున్నారు. పాములు పట్టడం, బిక్షాటన చేయడం వంటి పనులు చేస్తున్నారు. పక్కా గృహాలను మంజూరు చేసినా ఆర్థిక స్తోమత లేక నిర్మించుకోలేదు. చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు అక్టోబరు 18న ఉమ్మడి జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి సర్వే సూచనలు పంపించారు. ఈ నెల 4న మరోసారి కలెక్టర్ సుమిత్‌కుమార్ సర్వేకి సంబంధించిన సూచనలతో ఆదేశాలు జారీ చేశారు.మండలాల్లో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు బాధ్యత వహించి సచివాలయ ఉద్యోగులతో సర్వే చేయించాలి. అయితే నెల దాటినా తిరుపతి, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్లు సహా చాలా మండలాల్లో ఈ సర్వే ప్రారంభమే కాలేదు. మరికొంతమంది ఎంపీడీవోలు 'మా మండలంలో సంచార జాతులు లేవు' అని మొక్కుబడిగా నివేదిక ఇచ్చేశారు. ఇలా 8 మండలాల నుంచి వచ్చిన నివేదికలను జిల్లా అధికారులు వెనక్కి పంపించేశారు. ఇంకొంతమంది ఎంపీడీవోలకు అసలు ఈ సర్వే గురించి కనీస అవగాహన లేదు. జిల్లాలో సంచార జాతులవారు 85,436మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే ఇతర జాతుల నుంచి సంచార జాతుల్లోకి వచ్చినవారు 36,716 మంది ఉన్నారు.వీరిలో నుంచి సీడ్ పథకానికి అర్హుల్ని గుర్తించాలి.అయితే ఇప్పటి దాకా పెనుమూరు మండలంలో 23మందిని, వెదురుకుప్పంలో 86మందిని, చౌడేపల్లెలో 160మందిని, పెద్దపంజాణిలో 18మంది అబ్ధిదారుల్ని మాత్రమే గుర్తించారు. శాంతిపురం, నగరి, కుప్పం మున్సిపాలిటీ, ఎస్ఆర్‌పురం, గుడుపల్లె మండలాల్లో లబ్ధిదారులు ఎవరూ లేరని అక్కడి అధికారులు చెబుతున్నారు. ఇక యాదమరి, పులిచెర్ల, తవణంపల్లె, ఐరాల, పలమనేరు తదితర మండలాల్లో అయితే ఇంకా సర్వే మొదలుకాలేదు.



సంచార జాతుల సర్వే చేయడం అంత సులువు కాదు. ఇందుకు సర్వే సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలి. వీరు స్థిరంగా ఒక తావులో ఉండరు. వెతుక్కుంటూ వెళ్లాలి. సాధారణంగా పట్టణాల శివారు ప్రాంతాల్లో గుడారాలు వేసుకుని ఉంటారు. ఉదయాన్నే నిద్ర లేచి పల్లెల్లోకి, పట్టణంలోకి వెళ్లిపోతారు. సిబ్బంది వెళ్లి పలకరించగానే వీరు తమ సమాచారం చెప్పరు. కొన్ని సంచార తెగల మీద దొంగలు, వ్యభిచారులు అనే ముద్ర వేయడం వల్ల వీరు తమ జాతిపేరు చెప్పడానికి ఇష్టపడరు. చాలామంది మరాఠీలో మాట్లాడుతారు. లేదా మనకు అర్థం కాకుండా ఒక సంకేత భాషలో మాట్లాడుకుంటారు. నమ్మకం కలిగేలా వారితో ఓపికగా వ్యవహరించగలగాలి.

## ఏబీఎం పాలెం లో పింఛన్లు పంపిణీ చేసిన టిడిపి నాయకులు.



**నందికొట్కూర్ నవంబర్ 30 పల్లె వెలుగు** నందికొట్కూరు పట్టణంలోని ఏబీఎం పాలెం లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు నిమ్మకాయల మోహన్,కళాకారు,కాటేపోగు సన్నీ తెలుగు యువత నాయకులు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయ అడ్మిన్ రవితేజ తో కలిసి వారు ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులకు పింఛన్ల నగదు అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు నిమ్మకాయల మోహన్ మాట్లాడుతూ ఒకటో తేదీ ఆదివారం కావున ప్రభుత్వం ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే పంపిణీ చేయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారుల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న ఆదరణ అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులుమహేష్, ప్రమోద్, చిన్న వంశీ, అడివప్ప ప్రకాశం ప్రేమ్ లాల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మాలాల సింహాగర్జనకు తరలి వెళ్లిన మాల మహానాడు నాయకులు



**ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 30, పల్లె వెలుగు** డిసెంబర్ 1వ తేదీ ఆదివారము హైదరాబాద్ జింకానా గ్రౌండ్ లో ఎస్సి వర్గీకరణ కు వ్యతిరేకం గా జరగబోయే మాలాల సింహగర్జన మహాసభకు శనివారం ఆళ్లగడ్డ నుండి ఎస్సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు బయలు దేరారు. ముందుగా ఆళ్లగడ్డ లో కోవెలకుంట్ల సర్కిల్ లోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం వెహికల్స్ లలో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమం లో ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు దశిమి ప్రసాద్, సాత్రి రాజు, నెగాలా జాన్, ఎద్దుల దానియేలు, డాక్టర్ వేస్లీ తదితరులు పాల్గొన్నారు.

## (హెచ్ఐవి) ఎయిడ్స్ పై అవగాహన




**కొత్తపల్లి: నవంబర్ 30 పల్లె వెలుగు** మండల కేంద్రంలో డిసెంబర్ 1వ తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం వైద్య సిబ్బంది డాక్టర్ బేగ్ మరియు దీపా నాగమణి జడ్పీహెచ్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి కొత్తపల్లి పీఎస్సీ నుండి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఎయిడ్స్ కి నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు గ్రామీణ ప్రాంతాల్లో దీన్ని నియంత్రించవచ్చు ఒకప్పుడు నిర్వహించలేనిది దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితి అని ఇప్పుడు హెచ్ఐవి నివారించవచ్చు అన్నారు హెచ్ఐవి ఉన్న వ్యక్తి వైద్యుల సాయంతో తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవితాన్ని జీవించవచ్చు అన్నారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మెరిబా స్వచ్ఛంద సేవా సంస్థ ఓ ఆర్ డబ్ల్యు లక్ష్మీనరసమ్మ పాల్గొనడం జరిగింది

## కార్తీక బహుళ అమావాస్య పూజలు





**కొత్తపల్లి: నవంబర్ 30 పల్లె వెలుగు** మండలంలోని సంగమేశ్వరం వద్ద ఎగువ పుష్కరఘాట్ వద్ద ఉమామహేశ్వరాలయంలో శనివారం రోజు కార్తీక బహుళ అమావాస్య పూజలు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకాలు చేసుకున్నారు. అదేవిధంగా లలితాదేవి అమ్మవారికి భక్తులు రుద్రాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, మంగళహారతి వంటి విశేష పూజలు చేసుకున్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు కూష్మాండ దీపోత్సవం, గుమ్మడికాయ దీపోత్సవం చేసి ప్రత్యేక పూజలు చేసుకున్నారు.